నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 31-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:78 పేజీలు:68 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

తాండూరు కందిపప్పులు
మాండలికపు పరిధి దాటి మనుచు విదేశీ
భాండము లోనికి జొరబడి
తాండవ నృత్యమ్ము జేసి తనరె యశముతోన్ !!

(తెలంగాణా లోని తాండూరు కందిపప్పులకు విదేశాల్లో గిరాకీ పెరగడంతో అక్కడికి ఎగుమతి చేసి రాష్ట్ర ప్రజలు లాభాలు సంపాదించి సంతోషిస్తున్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

ఎమ్మెల్సీ ఎన్నికల్లో
ఎదురుదెబ్బ తగిలింది
కమలానికి అధిపత్య
కంచుకోట పగిలింది.
పార్టీ పట్టు భూపజాల
ప్రదేశాల్లో ఓటమి
ప్రజలపైనా అణచివేత
ప్రకంపన్ల కూటమి.

-వేల్పుల నారాయణ
9440433475



భూముల విక్రయంపై మంత్రివర్గంలో చర్చిస్తాం..

నిధులను విద్య, వైద్యం, సాగునీటి రంగాలకు కేటాయిస్తాం-సీఎం రేవంత్‌రెడ్డి



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:మియాపూర్‌లోని 550 ఎకరాల భూములపై సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని తెలిపారు. ఈ సందర్భంగా న్యాయస్థానానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ భూములను చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు.

మియాపూర్ భూములను కొల్లగొట్టేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన బంధువు, బీఆర్ఎస్ నేత దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాదరావు ప్రయత్నించారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారంలో దామోదర్‌రావుకు ముందుగానే ఖరీదైన కార్లను లంచంగా ఇచ్చారని, కేసీఆర్‌కు నగదు రూపంలో ముడుపులు అందించారని ఆరోపించారు. భూముల ఆక్రమణకు కొందరు అధికారులను కూడా ఉపయోగించుకున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో భూకబ్జాలపై పోరాడినందుకే తనపై కక్షగట్టి జైలుకు పంపించారని సీఎం వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు కేసీఆర్ కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని ఆరోపించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఐఎంజీ భూములను భలేరావు కుటుంబ సభ్యులతో కలిసి కేటీఆర్ చేజిక్కించుకునేందుకు ప్రయత్నించారని, న్యాయపోరాటం ద్వారా వాటిని అడ్డుకున్నామని పేర్కొన్నారు.

కంచె గచ్చిబౌలి, మామిడిపల్లి భూముల విషయంలోనూ బీఆర్ఎస్ నాయకుల ప్రయత్నాలను న్యాయపోరాటంతో అడ్డుకున్నట్లు చెప్పారు. గుర్రంగూడ అటవీ భూములను కేటీఆర్ అనుచరులు ఆక్రమించేందుకు ప్రయత్నించారని, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టును ఆశ్రయించామని తెలిపారు. ప్రభుత్వ వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఆ భూములు అటవీ భూములేనని స్పష్టం చేసిందని పేర్కొన్నారు.

మంచిరేవులలోని 143 ఎకరాల భూమిని కేటీఆర్ రాయలసీమ బిల్డర్స్‌తో కలిసి కబ్జా చేసేందుకు ప్రయత్నించారని సీఎం ఆరోపించారు. ఆ భూములను కాపాడి, అందులో పోలీసుల పిల్లల కోసం పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమిని బీఆర్ఎస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేకు అప్పగించారని, న్యాయపోరాటం చేసి ఆ భూములను రక్షించుకున్నామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ బీఆర్ఎస్ నాయకుల భూ ఆక్రమణలను అడ్డుకున్నామని వివరించారు.

మియాపూర్ భూములను విక్రయించి, ఆ నిధులను నీటిపారుదల, విద్య, వైద్యం తదితర రంగాల అభివృద్ధికి వినియోగిస్తామని సీఎం ప్రకటించారు. ఈ అంశాన్ని మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయం, వాటి ద్వారా వచ్చే నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధ్యయనం చేస్తుందని వెల్లడించారు.

మియాపూర్ భూములపై వచ్చిన తీర్పును బీఆర్ఎస్ నాయకులు ఎందుకు స్వాగతించడం లేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూ అధికారులను ఎందుకు అభినందించడం లేదని నిలదీశారు. భూముల ఆక్రమణలపై అసెంబ్లీలో చర్చించేందుకు బీఆర్ఎస్ నాయకులు రావాలని డిమాండ్ చేశారు. పద్మాలయ స్టూడియో, ల్యాంకో భూముల విషయంలో గతంలో కేసులు వేసిన కేసీఆర్, హరీశ్‌రావు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదని సీఎం ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక గతంలో ఎవరిపై కేసులు వేశారో వారితోనే రాజీ పడ్డారని ఆరోపించారు.

హరీశ్‌రావు మామ హనుమంతరావుకు సంబంధించిన భూముల సర్వేను అడ్డుకుంటున్నారని, కోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. భూముల ఆక్రమణలపై ప్రభుత్వం చర్యలు చేపడితే బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

రెండు గ్రామాల మధ్య ఉన్న వివాదాన్ని కేసీఆర్ తనకు అనుకూలంగా మలుచుకున్నారని సీఎం ఆరోపించారు. ఆ ప్రాంతంలోని భూముల ఆక్రమణలను తేల్చి, అక్కడ శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ నిర్మిస్తామని ప్రకటించారు. కేసీఆర్, కేటీఆర్ ఇప్పటికైనా ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించిన ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ఆక్రమణలపై న్యాయస్థానాలు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పులు ఇస్తున్నాయని వ్యాఖ్యానించారు

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం



రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు ఒడితలలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ ఉపకేంద్రం ప్రారంభం

వరంగల్, అక్టోబర్ 30:: ప్రజాపాలన ప్రభుత్వంలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని, రైతులకు విద్యుత్ నరఫరాలో ఇబ్బందులు కలగకుండా సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం ఒడితల గ్రామంలో రూ.2 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అనేక ప్రతిపాదనలు చేశారని తెలిపారు. నియోజకవర్గంలో గతంలో 49 సబ్‌స్టేషన్లు ఉండగా, ప్రస్తుతం మరో 12 సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసుకున్నామని, 127 ట్రాన్స్‌ఫార్మర్లను కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

ఎల్‌నినో ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉందని, విద్యుత్ డిమాండ్ పెరగడంతో పాటు భూగర్భ జలమట్టం తగ్గిందని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి విద్యుత్ తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు ఉపాధి పరంగా సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

రైతులు నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ పంటలు సాగు చేయాలని, రబీ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

తాగునీరు, విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తామని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు.

ఈ ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి భగవాన్, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు జమ

9.34 కోట్ల రైతు కుటుంబాలకు రూ.18,680 కోట్లు విడుదల.. ఒక్కొక్కరి ఖాతాలో రూ.2,000 జమ

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:పధాని నరేంద్ర మోదీ గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా భీల్డి వేదికగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం 24వ విడత నిధులను విడుదల చేశారు.

డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా దేశవ్యాప్తంగా 9.34 కోట్ల మంది రైతు కుటుంబాల ఖాతాల్లో రూ.18,680 కోట్లను జమ చేశారు.

అర్హులైన ప్రతి రైతు ఖాతాలో రూ.2,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు.

ఈ విడతలో గుజరాత్‌లోనే 52.33 లక్షలకు పైగా రైతు కుటుంబాలకు రూ.1,051 కోట్లకు పైగా నిధులు అందాయి. పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా ఒక్కో రైతు కుటుంబానికి రూ.6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇప్పటివరకు 24 విడతల్లో కలిపి దేశవ్యాప్తంగా రైతులకు రూ.4.65 లక్షల కోట్లకు పైగా నిధులు నేరుగా అందాయి.

హెలికాప్టర్ కూలి పైలట్ సహా ఆరుగురు దుర్మరణం..!

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30: ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని చమోలీ జిల్లా లో గల్లంతైన హెలికాప్టర్ కూలిపోయింది. హెలికాప్టర్ బద్రీనాథ్ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన సమయంలో ఆ హెలికాప్టర్‌లో పైలట్ సహా ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. జోషిమఠ్ కు దగ్గరలో ఉన్న చైయెన్ గ్రామం సమీపంలో హెలికాప్టర్ కూలినట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ఉన్న ఆరుగురు మరణించి ఉంటారని భావిస్తున్నారు.

ప్రమాదం సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన అధికారులు సెర్చ్ ఆపరేషన్ మొదలుపెట్టారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. మరో రెండు హెలికాప్టర్ల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ చేస్తున్నారు. ప్రస్తుతం అక్కడ ప్రతికూల వాతావరణం ఉండటంతో సహాయక చర్యలకు ఇబ్బందికరంగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

బద్రీనాథ్ నుంచి మధ్యాహ్నం 2.15 నిమిషాలకు హెలికాప్టర్ టేకాఫ్ తీసుకున్నది. హతీ పర్వత్ ఏరియా వద్ద ఆ హెలికాప్టర్‌తో కాంటాక్టు తెగినట్లు చెబుతున్నారు. స్నో కురవడంవల్ల హతీ పర్వత్ ఏరియా వద్ద కాంటాక్టు కోల్పోయినట్లు అధికారులు తేల్చారు. రాష్ట్ర, ఆర్మీ బృందాలు రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నాయి.

జాతీయ జనగణనలో బీసీ కులగణనను చేర్చాలి

ప్రభుత్వ భూములను కాపాడుకోవడం చారిత్రాత్మక విజయం
ప్రజాస్వామ్య పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 30:ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన నేపథ్యంలో ఆయన పలు అంశాలపై స్పందించారు. గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మంత్రి.. తెలంగాణ ప్రజలకు అమిత్ షా, ప్రధాని మోదీ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం 'ఓట్ బచావో-దేశ్ బచావో' నినాదంతో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ నాయకత్వంలో ఈ ఉద్యమం కొనసాగుతోందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ కాంగ్రెస్ నుంచి మండల, బ్లాక్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్లు సహా పలువురు ముఖ్య నాయకులు ఢిల్లీకి వెళ్లారని చెప్పారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్‌కు రావడంపై తమకు అభ్యంతరం లేదని మంత్రి స్పష్టం చేశారు. దేశ హోంమంత్రిగా ఎవరైనా హైదరాబాద్‌కు రావచ్చని, అవసరమైన అనుమతులు ఇస్తామని చెప్పారు. అయితే తెలంగాణ ఏర్పాటు, అమరవీరుల త్యాగాలపై గతంలో పార్లమెంటులో చేసిన వ్యాఖ్యలకు అమిత్ షా, ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని, అందుకే 'ఓట్ చోర్-గద్దీ చోడ్' నినాదంతో పోరాటం చేస్తున్నామని తెలిపారు. మణిపూర్, ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితులు, చైనా సరిహద్దు సమన్యల వంటి అంశాలను పక్కనపెట్టి ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో రాజకీయ ప్రయోజనాల కోసం అమిత్ షా పర్యటిస్తున్నారని విమర్శించారు.

బీసీల స్థితిగతులు మెరుగుపడాలంటే కులాల వారీగా జనాభా వివరాలు తెలుసుకోవడం అవసరమని పొన్నం ప్రభాకర్ అన్నారు. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా అందాలంటే బీసీ కులగణన తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అధికారికంగా లేఖ రాయనున్నట్లు వెల్లడించారు.దేశవ్యాప్తంగా పశువులు, గొర్రెల లెక్కలు తీస్తున్న కేంద్ర ప్రభుత్వం కోట్లాది మంది ఓబీసీల జనాభా వివరాలను ఎందుకు సేకరించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ బీజేపీ బీసీ నాయకులు లక్ష్మణ్, బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్ ఈ అంశంపై అమిత్ షాపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. జాతీయ జనగణనలో బీసీ కులగణనను చేర్చాలని డిమాండ్ చేశారు.

బీజేపీ పాలనలో రాజ్యాంగబద్ధమైన స్వతంత్ర సంస్థలు బలహీనపడుతున్నాయని మంత్రి ఆరోపించారు. దేశవ్యాప్తంగా పేదల ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై న్యాయస్థానాలు గతంలో చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు.ఓటు హక్కు ప్రజల ప్రజాస్వామిక హక్కు అని, దాన్ని హరించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే బీజేపీకి తగిన సమాధానం చెబుతారని పొన్నం ప్రభాకర్ అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన న్యాయపోరాటం ఫలించడంతో వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగామని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, న్యాయవ్యవస్థకు తెలంగాణ ప్రజల తరఫున అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడుకోవడం చారిత్రాత్మక విజయమని పేర్కొన్నారు.

రూ.84,790 కోట్లతో హైదరాబాద్ అభివృద్ధి..

-నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, అక్టోబర్ 30:హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దడంతో పాటు తెలంగాణను దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నగరాభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల పాత్ర కీలకమని అన్నారు. ఈ రంగాల్లో ఉన్నవారిని కేవలం వ్యాపారవేత్తలుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా ప్రభుత్వం గుర్తిస్తోందని తెలిపారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన నారెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షోలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

హైదరాబాద్‌కు ఇప్పటికే అనేక అనుకూలతలు ఉన్నాయని, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఇక్కడ స్థిరపడేందుకు ఆసక్తి చూపుతున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, బీహెచ్ఈఎల్, బీడీఎల్, ఈసీఐఎల్, డీఆర్‌డీఓ వంటి సంస్థలు, ఐఐటీ, ఐఐఐటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలు నగర అభివృద్ధికి బలమైన పునాదులుగా నిలిచాయని చెప్పారు. ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత విస్తరిస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు.

రూ.84,790 కోట్లతో భారీ ప్రణాళిక

హైదరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.84,790 కోట్లతో సమగ్ర కార్యాచరణ రూపొందించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఇందులో దాదాపు రూ.55 వేల కోట్ల పనులకు సంబంధించి డిజైన్లు, టెండర్ల ప్రక్రియ చేపట్టామని, పలు పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నాయని వివరించారు.

హెచ్ఎండీఏ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్, మెట్రో రైలు తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.52,706 కోట్లు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డుకు రూ.15,849 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో రూ.4 వేల కోట్లు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.2,500 కోట్లు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.2,163 కోట్లు కేటాయించామని చెప్పారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వివరించారు.

మూసీకి కొత్త రూపు

మూసీ నదిని శుభ్రమైన నీటితో ప్రవహించేలా మార్చి, హైదరాబాద్‌కు ఒక ముఖ్యమైన పర్యాటక, ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని భట్టి విక్రమార్క తెలిపారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలి దశలో సుమారు రూ.7,500 కోట్ల పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. నగరంలోని 21 ప్రధాన నాలాల వద్ద మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చి, టెండర్ల ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఎస్టీపీల సంఖ్యను 38కు పెంచే ఆలోచన ఉందన్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలు, ఉద్యానవనాల అవసరాలకు వినియోగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని చెప్పారు. సుమారు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఇందులో 15 వేల ఎకరాలను పచ్చదనం, బహిరంగ ప్రదేశాల కోసం కేటాయించనున్నట్లు చెప్పారు. మొత్తం భూభాగంలో 50 శాతం గ్రీన్ స్పేస్‌గా ఉండేలా ప్రణాళిక రూపొందించామన్నారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు తోడుగా ఫ్యూచర్ సిటీ మరో కీలక అభివృద్ధి కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులు నగర భవిష్యత్తుకు కొత్త దిశ చూపుతాయని చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలను నగరానికి తీసుకువచ్చే ప్రణాళికలు కూడా విస్తరణకు దోహదపడతాయని వివరించారు.

హైదరాబాద్‌ను వర్యావరణహిత నగరంగా తీర్చిదిద్దేందుకు హిల్ట్ పాలసీని తీసుకొచ్చినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని పరిశ్రమలను దశలవారీగా బయటకు తరలించి కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ప్రజా రవాణాలో డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఆటోలను కూడా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు సబ్సిడీతో సహకారం అందిస్తున్నామని వివరించారు.

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రవాణా సదుపాయాలను మెరుగుపరిచేందుకు సుమారు రూ.93 వేల కోట్లతో రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాలుగు వరుసల రహదారులు, ఫ్లైఓవర్లు, ఇతర

కులమతాల కుళ్లు భావనలకు అడ్డుకట్ట వేయలేమా !

(31 అక్టోబర్ "జాతీయ ఐక్యత దినం" సందర్భంగా)

భారత రత్న, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా 2014 నుంచి ప్రతి ఏట 31 అక్టోబర్‌న దేశవ్యాప్తంగా "జాతీయ ఐక్యత దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్" ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా మారింది. నేడు దేశవ్యాప్తంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ జాతీయ సమైక్యత సాధనకు చేయవలసిన కార్యక్రమాలను, దేశాభివృద్ధిలో దాని ప్రాముఖ్యతను వివరిస్తూ 2026 జాతీయ ఐక్యత దినోత్సవం ఇతివృత్తంగా "ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ (వన్ ఇండియా, గ్రేట్ ఇండియా)" అనే అంశంపై ప్రచారం నిర్వహిస్తున్నారు. భారతదేశ ఐక్యత, సమగ్రతలను కాపాడిన మహోన్నత వ్యక్తుల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరు ముందు వరుసలో ఉంటుంది. స్వాతంత్ర్యానంతరం చెల్లాచెదరుగా ఉన్న 570కి పైగా 'ప్రిన్స్‌లీ స్టేట్స్ లేదా రాచరిక రాజ్యాల'ను భారత్‌లో విలీనం లేదా ఏకీకరణ చేయడానికి పటేల్ చూపిన చొరవ అనన్యసామాన్యం, అనితరసాధ్యం. ఇందిరా గాంధీ హత్యకు లోనైన అక్టోబర్ 31ని 'రాష్ట్రీయ సంకల్ప్ దివస్'గా కూడా పాటించడం చూస్తున్నాం.

భారత స్వాతంత్ర్యోద్యమంలో సర్దార్ పటేల్ కీలక పాత్ర:

భరతజాతి స్వేచ్ఛ కోసం పోరాడిన సర్దార్ పటేల్ గౌరవార్థం ఏక్తా దివస్ నిర్వహించడం సముచితంగా ఉన్నది. స్వతంత్ర భారత తొలి హోం మంత్రి, ఉప ప్రధాని సర్దార్ పటేల్‌ను 'ఇండియన్ బిస్మార్క్'గా కూడా పిలుస్తారు. 31 అక్టోబర్ 1875న గుజరాత్‌లోని నాడియార్‌లో జన్మించిన వల్లభాయ్ పటేల్ ఇంగ్లాండ్‌లో బారిష్టర్ పూర్తి చేసి స్వదేశానికి వచ్చారు. సహాయ నిరాకరణ, విదేశీ వస్తు బహిష్కరణ, ఖాదీ వస్త్ర ధారణ, మద్యపాన నిషేధం, అస్పృశ్యత, కుల వివక్ష కిసాన్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలతో పాటు వలు జాతీయోద్యమంల్లో చురుకైన పాత్ర పోషించి సర్దార్ అనే బిరుదు పొందారు. భారత రాజ్యాంగ రూపకల్పనకు ఏర్పాటు చేసిన సభలో సీనియర్ సభ్యుడిగా సేవలందించారు. భారత రాజ్యాంగ ముసాయిదా కమిటీలో ముఖ్య నాయకుడిగా అంబేడ్కర్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. భారత రాజ్యాంగ సభలో ప్రాథమిక హక్కుల కమిటీ చైర్మన్‌గా కీలక భూమిక నిర్వహించారు.

కులమతాల అడ్డు గోడలు కూల్చేద్దాం :

వివిశాల భారతంలో 6 ముఖ్య మతాలు, 3000 ప్రధాన కులాలు, 25,000 ఉపకులాలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇన్ని కులమతాలకు చెందిన భారతీయులు ఏకంగా ముందుకు సాగడం ఓ అద్భుతం. భిన్నత్వంలో ఏకత్వం మన నిత్య మంత్రం కావాలి. కులమతాల కుళ్లు రాక్షస రాజకీయాలు, అంతటా వ్యాపిస్తున్న అవినీతి చెదలు, ఏకత్వ భావనకు తూట్లు పొడిచే దుర్మార్గపు ఆలోచనలు మన జాతి సమైక్యతను ప్రశ్నార్థకం చేస్తున్న వేళ మనందరం చేయి చేయి కలపడం అనివార్యం అవుతున్నది. ఇలాగే ఐక్యతకు తూట్లు పొడిస్తే మనల్ని మనమే నాశనం చేసుకున్నట్లు భావించాలి. ఐకమత్యమే మన అసలైన బలమని ప్రపంచానికి చాటి చెప్పాలి. మన కంటిని మన వేళ్లతోనే పొడుచుకోరాదు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం చాలా అవసరం అని భావించాలి. మాయదారి దేశద్రోహుల దురాలోచనల చేతులను, చేతలను మనమే నరికి వేయాలి. జాతీయ సమైక్యత సాధనకు సకారాత్మక మార్పు మన ఇంటి నుంచే మొదలు కావాలి. మన ఎదుగుదలకు ఎవ్వరి చేయూత అవసరం లేదు. మన పట్టుదల, సంకల్పం గట్టిగా ఉంటే ఏ కులము, మతము మన అభివృద్ధిని అడ్డుకోలేదని తెలుసుకుందాం. గడప లోపల కులం, మతం అని తలుస్తూ, గడప దాటితే మానవత్వం నిండిన మనుషులం అని చాటి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని అర్థమవుతోంది.

దేశ సార్వభౌమత్వం, ఐక్యతలను పెంపొందించే అంశాల్లో పాఠశాల, కళాశాలల్లో ఐక్యత ప్రతిజ్ఞలు, ప్రభుత్వ కార్యాలయాల్లో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ఐకమత్యం, సమగ్రత, దేశ భద్రత కాపాడటానికి అంకితభావంతో పని చేయడం మన తక్షణ కర్తవ్యమని గుర్తించి కోవాలి. పటేల్ యొక్క దార్శనికత, ఏకీకరణ స్ఫూర్తి రాబోయే తరాలకు దారి దీపం కావాలని కోరుకుందాం, పటేల్ దేశభక్తిని ఆదర్శంగా తీసుకుందాం. భిన్నత్వంలో ఏకత్వం మన నినాదమే మాత్రమే కాదని, భారతీయ పౌర సమాజాన్ని ఏకం చేసే పటిష్ట దారమని ప్రపంచానికి రుజువు చేద్దాం.



-మధుపాళీ
9949700037

అంతర్జాతీయంగా పోటీనిచ్చే క్రీడా పరికరాల తయారీ వ్యవస్థ నిర్మాణానికి ఖేలో ఇండియా క్రీడా పరికరాల తయారీ పథకానికి క్యాబినెట్ ఆమోదం

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర మంత్రివర్గం...2026 నుంచి 2033-34 కాలానికి మొత్తం రూ.1,856.67 కోట్ల అంచనా వ్యయంతో ఖేలో ఇండియా క్రీడా పరికరాల తయారీ పథకానికి ఆమోదం తెలిపింది. పెట్టుబడులు, తయారీ, ఆవిష్కరణలు, ఎగుమతులను ప్రోత్సహించడంతో పాటు ప్రపంచ క్రీడా వస్తువుల రంగంలో భారతదేశ స్థానాన్ని బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యం.

కేంద్ర బడ్జెట్ 2026?27లో ఈ పథకాన్ని ప్రకటించారు. పెట్టుబడులు, సాంకేతిక స్వీకరణ, పరిశోధన, ఆవిష్కరణ, నైపుణ్యాభివృద్ధి, నాణ్యతా ధ్రువీకరణ, మార్కెట్ అభివృద్ధి కోసం లక్షిత సాయం అందించడం ద్వారా భారతదేశంలో క్రీడా పరికరాల తయారీని బలోపేతం చేయడమే ఈ పథకం లక్ష్యం. అంతర్జాతీయంగా పోటీపడగల క్రీడా పరికరాల పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడటంతో పాటు ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో భారత్ స్థానాన్ని ఈ పథకం బలోపేతం చేస్తుంది.

ఖేలో భారత్ నీతి?2025, మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఈ పథకం పెట్టుబడులను ఆకర్షిస్తుందని, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, దేశీయ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేస్తుందని, అంతర్జాతీయంగా పోటీపడేలా భారతీయ క్రీడా పరికరాలను తీర్చిదిద్దుతుందని అంచనా వేస్తున్నారు.

తయారీదారులు, సరఫరాదారులు, పరీక్షా కేంద్రాలు, రూపకల్పన, నమూనాలను తయారు చేసే కేంద్రాలు, అనుబంధ సంస్థలను ఈ పథకం ఒకే చోట ఏర్పాటు చేస్తుంది. తద్వారా క్లస్టర్ ఆధారిత తయారీని ప్రోత్సహించడానికి, సమీకృత పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థలను సృష్టించడానికి అవసరమైన ప్రత్యేక క్రీడా వస్తువుల తయారీ జోన్‌లను (ఎన్‌జీఎంజడ్) అభివృద్ధి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. భవ్య పథకం, ఎన్ఐసీడీసీ పారిశ్రామిక పార్కుల పరిధిలో ఉన్న ప్రస్తుత పారిశ్రామిక మౌలిక సదుపాయాలతో అనుసంధానం చేయడం ద్వారా ఈ జోన్‌లను అభివృద్ధి చేస్తారు. ఇది క్రీడా పరికరాల విలువ ఆధారిత వ్యవస్థ అంతటా సమర్థమైన తయారీకి, బలమైన పారిశ్రామిక అనుసంధానాలకు, పోటీతత్వం పెరగడానికి వీలు కల్పిస్తుంది.

సమీకృత ఉత్పాదక సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి, పారిశ్రామిక అనుసంధానాలను బలోపేతం చేయడానికి, కార్యాచరణ సామర్థ్యాలను పెరుగువరచడానికి ఈ జోన్‌లు తోడ్పడతాయి. ఈ చర్యలు పెట్టుబడులు సులభతరం చేస్తాయని, ఉత్పత్తి సామర్థ్యాలను పెంపొందిస్తాయని, దేశంలో పటిష్ఠమైన క్రీడా వస్తువుల తయారీ రంగం అభివృద్ధికి మద్దతు ఇస్తాయని భావిస్తున్నారు.

క్రీడా పరికరాల రంగంలో నూతన పెట్టుబడులను ఆకర్షించడం, దేశీయ తయారీ రంగం సామర్థ్యాన్ని బలోపేతం చేయడంపై ఈ పథకం ప్రధాన దృష్టి సారిస్తుంది. నిర్దేశిత క్రీడాపరికరాల జోన్లలో పరిశ్రమలను ఏర్పాటు చేసేలా ప్రముఖ దేశీయ, అంతర్జాతీయ తయారీదారులను, బ్రాండ్లను, రీటైల్ వ్యవస్థలను యాంకర్ ఇన్వెస్ట్మెంట్ మద్దతు విభాగం ప్రోత్సహిస్తుంది. అలాగే పటిష్ఠమైన సరఫరాదారులు, అనుబంధ వ్యవస్థల అభివృద్ధికి దోహదపడుతుంది. దీనికి తోడుగా అధిక ఉత్పత్తిని, సామర్థ్య విస్తరణను, సుస్థిరమైన తయారీ వృద్ధిని టర్నోవర్ ఆధారిత తోడ్పాటు విభాగం ప్రోత్సహిస్తుంది.

మొత్తంగా రూ.1,130 కోట్ల వ్యయంతో చేపట్టే ఈ కార్యక్రమాలు దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తాయని, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గిస్తాయని అంచనా వేస్తున్నారు. అలాగే దేశీయంగా విలువ జోడింపును పెంచుతాయని, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని, విలువ ఆధారిత వ్యవస్థ అంతటా ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని, అంతర్జాతీయ మార్కెట్లలో భారతదేశ పోటీతత్వాన్ని మెరుగుపరుస్తాయని కూడా భావిస్తున్నారు.

క్రీడా పరికరాల రంగంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈలు) పోషించే ముఖ్యమైన పాత్రను గుర్తించిన ఈ పథకం ఇప్పటికే ఉన్న తయారీ క్లస్టర్లను బలోపేతం చేయడానికి, చిన్నస్థాయి పరిశ్రమల వృద్ధికి సహాయం అందించడానికి ప్రాధాన్యమిస్తుంది.

ఉమ్మడి సౌకర్యాలు, భాగస్వామ్య మౌలిక సదుపాయాల అభివృద్ధితో సహా ప్రస్తుతం ఉన్న క్రీడా వస్తువుల తయారీ క్లస్టర్‌ల ఉన్నతీకరణకు సాయం అందిస్తుంది.

భారతీయ క్రీడా వస్తువుల పోటీతత్వాన్ని పెంపొందించడంలో అంతర్జాతీయంగా ఆమోదం పొందిన నాణ్యత, పనితీరు ప్రమాణాల ప్రాముఖ్యతను ఈ పథకం గుర్తిస్తుంది.

అంతర్జాతీయ క్రీడా సమాఖ్యల నుంచి ధృవీకరణ పత్రాలను పొందడానికి, వాటిని పునరుద్ధరించుకోవడానికి రూ.105 కోట్ల రూపాయలతో తయారీదారులకు తోడ్పాటును అందిస్తుంది.

ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడానికి, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశాన్ని సులభతరం చేయడానికి, భారతదేశంలో తయారైన క్రీడా వస్తువులపై విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి ఈ చర్యలు తోడ్పడతాయి.

క్రీడా పరికరాల రంగంలో పరిశోధన, రూపకల్పన, ఆవిష్కరణలను బలోపేతం చేయడంపై ఈ పథకం ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

క్రీడా పరికరాలు, మెటీరియల్ సైన్సెస్, రక్షణ పరికరాలు, అధునాతన తయారీ సాంకేతిక పరిజ్ఞానాల్లో పరిశోధనను ప్రోత్సహించడానికి ప్రముఖ విద్యా, పరిశోధన సంస్థల్లో ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు సాయం అందిస్తుంది.

అనుసంధాన్ జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌తో సమన్వయం చేసుకోవడం ద్వారా పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలను కూడా ప్రోత్సహిస్తుంది.

స్టార్టప్ ఇండియా కార్యక్రమానికి అనుగుణంగా అంకురసంస్థలకు సాయం అందించడం ద్వారా క్రీడా పరికరాల తయారీ రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. క్రీడా పరికరాల తయారీ వ్యవస్థలో సరికొత్త సాంకేతికతలు, ప్రక్రియలు, ఉత్పత్తుల అభివృద్ధి, పరీక్ష, ధ్రువీకరణ, వాణిజ్యీకరణను సులభతరం చేస్తుంది.

క్రీడా పరికరాల తయారీ రంగంలో ఉపాధి కల్పనకు విస్తృత అవకాశాలు ఉన్నాయని ఈ పథకం గుర్తించింది. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు అందిస్తుంది.

మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి, ఔత్సాహిక పారిశ్రామిక మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత పరిశ్రమ వర్గాల సహకారంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలవుతాయి.

నైపుణ్యాలు కలిగిన మానవ వనరులకు పెరుగుతున్న డిమాండును ఈ ప్రయత్నాలు తీరుస్తాయి. క్రీడా పరికరాల తయారీ రంగం దీర్ఘకాలిక అభివృద్ధికి తోడ్పడతాయి.

అక్రమ వసూళ్లు, వేధింపుల ఆరోపణలు..

ఇద్దరు ఆర్ఐలపై సస్పెన్షన్ వేటు! యాపల్‌గూడ రెండో బెటాలియన్‌లో ఉన్నతాధికారుల చర్యలు ఆర్ఎస్ఐపై హత్యాయత్నం కేసు.. విచారణలో వెలుగుచూసిన అక్రమాలు

ఆదిలాబాద్, అక్టోబర్ 30: ఆదిలాబాద్ జిల్లా యాపల్‌గూడలోని టీజీఎస్పీ రెండో బెటాలియన్‌లో చోటుచేసుకున్న అక్రమ వసూళ్లు, అవినీతి, సిబ్బంది వేధింపుల ఆరోపణలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ వ్యవహారంపై నిర్వహించిన విచారణలో ఆరోపణలు వాస్తవమని తేలడంతో ఇద్దరు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు (ఆర్ఐలు) ఏ. రమేష్, ఎం. నరేష్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బొలెరోతో ఢీకొట్టి హత్యాయత్నం

బెటాలియన్‌లో పనిచేస్తున్న ఆర్ఎస్ఐ రాకేష్‌పై ఆర్ఐ నరేష్ బొలెరో వాహనంతో ఢీకొట్టి హత్యాయత్నానికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. దీనిపై రూరల్ పోలీసులు ఆర్ఐ నరేష్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

డ్యూటీకి రాకపోతే డబ్బులు వసూలు!

ఇదే బెటాలియన్‌కు చెందిన మరో ఆర్ఐ ఏ. రమేష్‌పై కూడా సిబ్బంది నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయి. విధులకు గైర్హాజరైన సిబ్బంది నుంచి డబ్బులు వసూలు చేయడం, వారిని వేధించడం వంటి చర్యలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది.

రెండో బెటాలియన్‌లో జరుగుతున్న అవినీతి, అక్రమ వసూళ్లు, వేధింపులపై ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఆరోపణలపై వివరాలు సేకరించి, వాటిని పరిశీలించిన అనంతరం ఆర్ఐలు ఏ. రమేష్, ఎం. నరేష్‌లను సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలో క్రమశిక్షణకు ప్రాధాన్యమున్న నేపథ్యంలో అధికారులపై వచ్చిన ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి.

2026-27 నుంచి 2030-31 వరకు ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజనకు కేంద్ర ప్రాయోజిత పథకంకు ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:వికసిత్ భారత్ జాతీయ దృక్పథానికి అనుగుణంగా తదుపరి తరం పాలనా సంస్కరణల కార్యక్రమం ద్వారా నూతన కేంద్ర ప్రాయోజిత పథకం (సీఎస్ఎస్)గా ప్రధానమంత్రి వికసిత గ్రామ స్వరాజ్ యోజన (పీఎం వీజీఎన్వై)కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. 2026-27 నుంచి 2030-31 వరకు (వదహారవ ఆర్థిక సంఘం కాలపరిమితితో సమానంగా) ఈ పథకాన్ని అమలు చేసేందుకు ఆమోదం లభించింది.

ఈ పథకం మొత్తం అంచనా వ్యయం రూ. 7,395.55 కోట్లు కాగా... కేంద్ర వాటా రూ. 4,869.48 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 2,526.07 కోట్లు.

లబ్ధిదారుల సంఖ్య: దేశవ్యాప్తంగా 2.55 లక్షలకు పైగా పంచాయతీలు, సంప్రదాయ స్థానిక సంస్థల్లోని దాదాపు 32 లక్షల మంది ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ఇతర భాగస్వాములు ఈ పథకం ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం పొందుతారు. ప్రతి అవగాహన కార్యక్రమం కనీసం కోటి మందికి చేరుతుంది.

గ్రామ స్వరాజ్ పోర్టల్ ద్వారా ఏటా 2.55 లక్షల సమగ్ర గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు మద్దతివ్వటం, ఇందులో గ్రామ ప్రాధాన్యతలు, సంబంధిత కేంద్ర, రాష్ట్ర శాఖల జోక్యాలు, అందుబాటులో ఉన్న వనరులను భాగస్వామ్య సాక్ష్యాధారిత ప్రణాళిక ద్వారా అనుసంధానిస్తారు.

ప్రభుత్వ పథకాలు, జాతీయ కార్యక్రమాలపై అవగాహన మెరుగుపరిచేందుకు, స్థానిక ప్రభావాలపై చర్చలను ప్రోత్సహించేందుకు, డిజిటల్, ప్రచార వేదికలు, గ్రామ సభలు, ఇతర పంచాయతీ వేదికలను ఉపయోగించి ప్రతి సమన్వయ అవగాహన ప్రచారంలో కనీసం కోటి మంది పౌరులను చేరుకోవటం.

సమగ్ర ప్రణాళిక, పౌరులతో సంభాషణ, వనరుల నిర్వహణ, స్థానిక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా పురోగతిని మెరుగుపరిచేందుకు... సామర్థ్య పెంపుదల, డిజిటల్ హ్యాండ్‌హోల్డింగ్ ద్వారా ఏటా సుమారు 32 లక్షల మంది ఎన్నికైన ప్రజా ప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది, ఇతర భాగస్వాముల పాలనా సామర్థ్యాలను బలోపేతం చేయటం.

ఆన్‌లైన్ ఆడిట్ ద్వారా ఏటా కనీసం 2.55 లక్షల ఆడిట్ ప్రణాళికలకు మద్దతివ్వటం, తదనుగుణంగా ఆడిట్లను సకాలంలో పూర్తి చేయటం. మెరుగైన అకౌంటింగ్, పబ్లిక్ ప్రకటనలు, సొంత ఆదాయ వనరుల సమీకరణతో పాటు అందుబాటులో ఉన్న నిధుల జవాబుదారీతనాన్ని బలోపేతం చేయటం. ఆర్థికంగా మరింత స్వావలంబన గల పంచాయతీలకు మద్దతు.

ఈ పథకం ద్వారా ఎటువంటి శాశ్వత పోస్టులను రూపొందించరు. సాంకేతికంగా మద్దతిచ్చేందుకు, దాని లక్ష్యాలను సాధించేందుకు సంస్థాగత వ్యవస్థలో భాగంగా రాష్ట్ర, జిల్లా, బ్లాక్ స్థాయిలో అవసరం మేరకు కాంట్రాక్టు పద్ధతిలో మానవ వనరులను నియమించవచ్చు.

గ్రామస్థాయిలో జాతీయ పరివర్తనాత్మక సంస్కరణల సద్వినియోగం: ప్రభుత్వ వినూత్న కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేసేందుకు, మెరుగైన ప్రజా సేవలను అందించేందుకు, గ్రామీణాభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేందుకు గత పన్నెండేళ్లలో చేపట్టిన జాతీయ నంస్కరణలు చక్కటి అవకాశాలను సృష్టించాయి. ఈ అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకునేందుకు స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకోవటం, క్షేత్రస్థాయిలో అందరి భాగస్వామ్యం చాలా ముఖ్యం. 2026-27 నుంచి 2030-31 ఆర్థిక సంవత్సరాల మధ్య గ్రామీణ స్థానిక సంస్థలకు సుమారు రూ. 4.35 లక్ష కోట్ల నిధులను 16వ ఆర్థిక సంఘం సిఫారసు చేసిన నేపథ్యంలో... జాతీయ ప్రాధాన్యతలు, ప్రభుత్వ పథకాలు, అందుబాటులో ఉన్న వనరులు, స్థానిక ఆకాంక్షలను సమన్వయం చేసుకునే సామర్థ్యం పంచాయతీలకు ఎంతో అవసరం. సమగ్ర ప్రణాళికలు, వివిధ శాఖల మధ్య సమన్వయం, సామర్థ్య పెంపుదల, గ్రామసభల ద్వారా సమాలోచనలు జరపటం వంటి అంశాల ద్వారా ఈ విధానానికి పీఎం వీజీఎన్వై పూర్తి మద్దతునిస్తుంది. ఇది జాతీయ స్థాయి కార్యక్రమాలను, మెరుగైన ఆర్థిక వనరులను స్థానికంగా సార్థకమైన అభివృద్ధి ఫలితాలుగా మార్చటంలోనూ, వికసిత్ భారత్ సాధనలోనూ కీలక పాత్ర పోషిస్తుంది.

స్థానిక పాలన కేంద్రాలుగా గ్రామ పంచాయతీలు: సమగ్ర స్థానిక ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాల సమన్వయానికి గ్రామ పంచాయతీలను ప్రధానమంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ యోజన (పీఎం వీజీఎన్వై) కేంద్రంగా నిలవనుంది. గ్రామ ప్రాధాన్యతలు, ప్రభుత్వ చర్యలు, అందుబాటులో ఉన్న వనరులను ఒకే తాటిపైకి తెచ్చేలా పంచాయతీలకు అండగా నిలవనుంది. తద్వారా అట్టడుగు స్థాయి అభివృద్ధికి ఇవి కేంద్రంగా మారతాయి. ఈ పథకం వికసిత్ భారత్ దృక్పథాన్ని గ్రామీణ ప్రజల అవనరాలు, ఆకాంక్షలతో అనుసంధానిస్తుంది.

గ్రామ పంచాయతీ స్థాయిలో సమగ్ర ప్రణాళికలు: కేంద్రంలోని అన్ని సంబంధిత మంత్రిత్వశాఖలు, విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికా ప్రక్రియలను ఈ పథకం... ఒకే డిజిటల్ వేదిక మీదకు తీసుకువస్తుంది. దీనివల్ల అందరూ కలిసి సమగ్ర గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ)ను రూపొందించుకునే వీలుంటుంది. లోపాలను గుర్తించటం, ప్రణాళికలను సమన్వయం చేసుకోవటం, కేంద్ర ఆర్థిక సంఘం నిధులతో సహా అందుబాటులో ఉన్న వనరులను మెరుగ్గా వినియోగించుకునేందుకు పంచాయతీలకు, సంబంధిత విభాగాలకు ఇది దోహదపడుతుంది. వ్యక్తిగత పథకాలను అమలు చేసే ప్రస్తుత విభాగాల ఏర్పాట్లు యథాతథంగా కొనసాగుతాయి.

ప్రతి గ్రామ పంచాయతీ అభివృద్ధిని సులభంగా అర్థమయ్యేలా చూపే విధానం: ఈ-గ్రామ్ స్వరాజ్, ఇప్పటికే అమల్లో ఉన్న ఈ-పంచాయత్ వ్యవస్థల ఆధారంగా... ప్రభుత్వ పథకాలు, లబ్ధిదారులు, ప్రయోజనాలు, సామాజిక ఆస్తులు, అందుబాటులో ఉన్న వనరులకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ఒకే డిజిటల్ వేదికపైకి ఈ పథకం తీసుకువస్తుంది. తద్వారా స్థానిక అవసరాలను గుర్తించి, లోపాలను సరిదిద్దుకునేందుకు ప్రణాళికలు, సమన్వయం, పర్యవేక్షణను మెరుగుపరచుకునేందుకు పంచాయతీలకు ఇది ఉపయోగపడుతుంది.

స్థానిక అవనరాలతో జాతీయ ప్రాధాన్యతల అనుసంధానం: ప్రభుత్వ పథకాలు, జాతీయ కార్యక్రమాలను సులభంగా, అందరికీ అర్థమయ్యే భాషలో వివరించేందుకు పంచమ్ (17 భారతీయ భాషల్లో అందుబాటులో ఉన్న ఏఐ-ఆధారిత ద్విముఖ సమాచార వేదిక) సహా ఇప్పటికే ఉన్న శిక్షణ, డిజిటల్, ప్రచార వేదికలను పీఎం వీజీఎన్వై వినియోగించుకుంటుంది. గ్రామ సభలు, పంచాయతీ వేదికల ద్వారా ఉమ్మడి చర్చలను ప్రోత్సహించి... జాతీయ ప్రాధాన్యతలను స్థానిక అవనరాలు, గ్రామాభివృద్ధి లక్ష్యాలతో అనుసంధానించేందుకు ఇది తోడ్పడుతుంది.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం!

ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ముందుకు రావాలి

పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి



కరీంనగర్, అక్టోబర్ 30: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పెద్దపల్లి డీసీపీ భూక్య రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం సుల్తానాబాద్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక ఎస్వీఆర్ గార్డెన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన డీసీపీ రామ్‌రెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి సకాలంలో అందించేందుకు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేసిన మూడు నెలల్లోనే శరీరంలో తిరిగి రక్తం సమకూరుతుందని తెలిపారు. సాధారణంగా ఒక్కో వ్యక్తి నుంచి 250 నుంచి 300 మిల్లీలీటర్ల వరకు రక్తాన్ని సేకరించి అవసరమైన వారికి అందిస్తారని వివరించారు. ఆరోగ్యవంతులు రక్తదానం చేయడం వల్ల సాధారణంగా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సుల్తానాబాద్ సర్కిల్ పరిధిలో కనీసం వెయ్యి మంది రక్తదాతలను సిద్ధం చేసేలా ఎస్సైలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ పొన్నమనేని రంజిత్‌రావు, ఎస్సైలు చంద్రకుమార్, మధుకర్, సుధాకర్, రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ సభ్యులు, పోలీసు సిబ్బంది, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పర్యాటకం, స్థానిక వ్యాపారాలతో ఏక్తా మాల్స్‌ను అనుసంధానించాలని పిలుపునిచ్చిన ప్రధానమంత్రి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:క్రియాశీల పాలన, సకాలంలో అమలును ప్రోత్సహించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఐసీటీ ఆధారిత బహుళ-విధాన వేదిక 'ప్రగతి' 54వ సమావేశం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు సేవా తీర్థ్‌లో జరిగింది. పథకాల అమలులో అడ్డంకులను పరిష్కరించడానికి... ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల పంపిణీని మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ వేదిక ఏకతాటిపైకి తెస్తుంది.

31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రూ. 16 వేల కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన రైల్వే, ఏక్తా మాల్స్, డ్రగ్ పార్క్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పురోగతిని ఈ సమావేశంలో ప్రధానమంత్రి సమీక్షించారు. ఆర్థిక వృద్ధికి, ప్రజా సంక్షేమానికి కీలకమైన ఈ ప్రాజెక్టుల కాలపరిమితులు, వివిధ ఏజెన్సీల మధ్య సమన్వయం, సమస్యల సకాల పరిష్కారంపై దృష్టి సారిస్తూ శ్రీ మోదీ సమీక్ష నిర్వహించారు.

పీఎం ఏక్తా మాల్స్‌లో స్థానిక ఉత్పత్తులకు మార్కెట్లను కల్పించాలని... చేతివృత్తుల వారి జీవనోపాధిని బలోపేతం చేయాలని... వారి వ్యాపారాల విస్తరణలో సహాయం అందించాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. పెరిగిన డిమాండ్... గ్రామీణ ఉత్పత్తి, ప్యాకేజింగ్, నిల్వ, రవాణా రంగాల్లో ఉపాధిని సృష్టించగలదని శ్రీ మోదీ పేర్కొన్నారు. ఈ మాల్స్‌ను పర్యాటకం, స్థానిక వ్యాపారాలతో అనుసంధానించాలని ప్రధానమంత్రి సూచించారు. ప్రజా వ్యయం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మెరుగుదలగా పరిణమించేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఆకాంక్షాత్మక జిల్లాలు, ఆకాంక్షాత్మక మండలాల బ్లాక్ డ్రగ్ పార్కుల పురోగతిని సమీక్షిస్తూ... ఈ రంగంలో స్వయం-సమృద్ధి సాధన లక్ష్యంగా క్రియాశీల ఔషధ పదార్థాలు, అవసరమైన ముడి సరుకుల దేశీయ ఉత్పత్తికి ప్రాధాన్యమివ్వాల్సిన అవసరాన్ని ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

పథకాల అమలులో లోపాలను సరిదిద్దడానికి... అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడటానికి ప్రధాన కార్యదర్శులు ప్రతి నెలా జిల్లా మేజిస్ట్రేట్‌లతో కలిసి పథకాలను సమీక్షించాలని ప్రధానమంత్రి కోరారు. కేటాయింపుల కంటే ఫలితాలపైనే ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజా వ్యయం ప్రజల జీవితాల్లో స్పష్టమైన మెరుగుదలగా పరిణమించేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఆకాంక్షాత్మక జిల్లాలు, ఆకాంక్షాత్మక మండలాల కార్యక్రమాలను ప్రస్తావిస్తూ... వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి వేగవంతంలో సమన్వయం, నిరంతర పర్యవేక్షణ, స్థానిక జవాబుదారీతనం పాత్రను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. పరిపాలన బలోపేతం, సంక్షేమ పథకాల పంపిణీని మెరుగుపరచడం కోసం తమ ప్రభుత్వం కొనసాగిస్తున్న నిరంతర ప్రయత్నాల కారణంగానే దాదాపు 25 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడగలిగారని శ్రీ మోదీ తెలిపారు.

అహ్మదాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పై సమీక్ష సందర్భంగా... ప్రయాణికుల సౌకర్యం, ప్రయాణ సౌలభ్యాన్ని పెంచడానికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధిని వేగవంతం చేయాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. పునరాభివృద్ధి చేసిన స్టేషన్లను మెట్రో, ఇతర రవాణా వ్యవస్థలతో నిరంతర అనుసంధానం ద్వారా బహుళ రవాణా కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని శ్రీ మోదీ ఉద్ఘాటించారు.

అమలులో ఎదురయ్యే అడ్డంకులను మిషన్ మోడ్‌లో పరిష్కరించాలని ప్రధానమంత్రి సూచించారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలనీ, అత్యున్నత స్థాయిలో నిశిత వర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కోరారు. ప్రతి స్థాయిలోనూ అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, చురుకైన పని సంస్కృతిని కొనసాగించాలని శ్రీ మోదీ పిలుపునిచ్చారు. అమలులో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేయడం, సకాలంలో నిర్ణయాలు తీసుకోవడం, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడానికి స్పష్టమైన జవాబుదారీతనాన్ని నిర్ధారించడం వంటి వాటి ఆవశ్యకతనూ ప్రధానమంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు.

నేటితో ముగియనున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6... నిర్ణీత లక్ష్యాలను అధిగమించిన భారత రైల్వేలు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30: అక్టోబర్ 2వ తేదీ నుంచి 31, 2026వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6లో భారత రైల్వేలు క్రియాశీలకంగా పాల్గొంటున్నాయి. ఈ ప్రచారం అక్టోబర్ 31తో ముగియనున్న నేపథ్యంలో పెండింగ్ అంశాల పరిష్కారానికి చేపట్టిన ప్రత్యేక ప్రచారంలో (ఎస్‌సీడీపీఎం-6) రైల్వే శాఖ పలు కీలక లక్ష్యాలను అధిగమించింది. ముఖ్యంగా పరిశుభ్రత, స్క్రాప్ తొలగింపు, ఈ-వేస్ట్ నిర్వహణ, పెండింగ్ వ్యవహారాల పరిష్కారం, ప్రక్రియల సరళీకరణలో గణనీయమైన పురోగతి సాధించింది.

ప్రజా కేంద్రీకృత కార్యక్రమంలో భాగంగా ప్రయాణికులతో నేరుగా మాట్లాడేందుకు, పరిశుభ్రత, ప్రయాణికుల సదుపాయాలు, రైల్వే సేవలపై అభిప్రాయాలు, సూచనలు స్వీకరించేందుకు అక్టోబర్ 22, 2026న దేశవ్యాప్తంగా 5,884 రైల్వే స్టేషన్లలో రైల్ జన్ సంవాద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యూఢిల్లీ స్టేషన్‌లో రైల్వే బోర్డు ఛైర్మన్, సీఈఓ శ్రీ సతీశ్ కుమార్ వాటాదారులతో మాట్లాడారు. ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినల్‌లో జరిగిన కార్యక్రమంలో డీఏఆర్‌పీజీ కార్యదర్శి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను గుర్తించి, ప్రయాణికుల సేవలను మరింత మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు అవకాశం లభించింది. అక్టోబర్ 31తో ప్రత్యేక ప్రచార కార్యక్రమం-6 ముగియనున్న నేపథ్యంలో ఈ ప్రచార కాలంలో సాధించిన విజయాలను సుస్థిరం చేయటంపై భారత రైల్వేలు దృష్టి సారిస్తున్నాయి. పరిశుభ్రత, వనరుల సమర్థవంతమైన నిర్వహణ, పెండింగ్ అంశాల సత్వర పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన సేవలందించటమే లక్ష్యంగా ఇలాంటి ఉత్తమ విధానాలను కొనసాగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోంది..

-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్



కరీంనగర్, అక్టోబర్ 30: మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని, యువత స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు.

జగిత్యాల రూరల్ మండలం పొలాస, నర్సింగ్ పూర్ గ్రామాలకు చెందిన ముగ్గురు మైనారిటీ మహిళలకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన కింద ఒక్కొక్కరికి రూ. 50 వేల చొప్పున చెక్కులను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించాలని, మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్ సెటి ద్వారా శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. పొలాసకు చెందిన సైమా సమీర్, రహీమా బేగం, నర్సింగ్ పూర్ కు చెందిన అఫ్రీనా బేగంలకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, ఎంపీడీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏడాది తర్వాత రామారావు హంతకులు చిక్కారు!

-సీపీఎం నేత హత్య కేసులో నలుగురి అరెస్ట్

-సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించాం: సీపీ సునీల్ దత్



ఖమ్మం, అక్టోబర్ 30: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సీపీఎం నేత సామినేని రామారావు హత్య కేసులో ఏడాది తర్వాత కీలక పురోగతి నమోదైంది. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. సాంకేతిక ఆధారాల విశ్లేషణతోపాటు వివిధ కోణాల్లో చేపట్టిన దర్యాప్తు ద్వారా నిందితులను గుర్తించినట్లు తెలిపారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.

ఖమ్మం రూరల్ మండలం తెల్దారుపల్లికి చెందిన బోడపట్ల శ్రీనివాసరావు అలియాస్ మెంటల్ శ్రీను, నూకల లింగయ్య, మల్లారపు లక్ష్మయ్య, కర్లపూడి ఉదయ్‌కుమార్ అలియాస్ రుక్మాన్ కుమార్‌లను అరెస్ట్ చేసినట్లు సీపీ తెలిపారు. ప్రాథమిక విచారణలో రాజకీయ, ఆర్థిక విభేదాలు హత్యకు కారణాలుగా వెల్లడైనట్లు పేర్కొన్నారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో గతేడాది అక్టోబరు 31న మార్నింగ్ వాక్‌కు వెళ్లిన సామినేని రామారావుపై దుండగులు కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఈ ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. సీపీఎం నేత హత్యకు గురికావడంతో రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. అప్పటి నుంచి పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు కొనసాగించారు.

ఆపరేషన్ సిందూర్ భారత్ చురుకైన, యుద్ధరంగంలో పరీక్షించిన రక్షణ విధానాన్ని స్పష్టంగా చాటి చెప్పింది: రాజ్‌నాథ్ సింగ్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:ప్రాంతీయ భద్రతను నమ్మశక్యంగా పరిరక్షించడం, అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడం పట్ల భారత్ తన నిబద్ధతను చాటుకుందని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భారత్‌కు ఉన్న విస్తృత అనుభవం తరగతి గదుల్లో నేర్చుకున్న సిద్ధాంతపరమైన జ్ఞానం కాదని, నరిహద్దుల ఆవల నుంచి ఎదురయ్యే సంక్లిష్ట భద్రతా సవాళ్లను దశాబ్దాలుగా ప్రత్యక్షంగా ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో సంపాదించిన అనుభవమని ఆయన పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 29న ఫిలిప్పీన్స్‌లోని సెబూలో జరిగిన 13వ ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం (ఏడీఎంఎం-ప్లస్)లో ఆయన ప్రసంగించారు. భారత్ అనునరించే ప్రతి వ్యూహం వాస్తవ కార్యాచరణలో పరీక్షించి, మెరుగుపరిచి, నిరూపితమైందని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడం, ప్రభుత్వ మద్దతుగల ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించబోమనే స్పష్టమైన వైఖరిని అమలు చేయడం ద్వారా భారత్ అనుసరించిన చురుకైన, యుద్ధ రంగంలో పరీక్షించిన రక్షణ విధానం స్పష్టంగా వెల్లడైందని తెలిపారు.

ఉగ్రవాదానికి సరిహద్దులు ఉండవని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి సైనిక విన్యాసాలు, సామర్థ్యాల పెంపు కార్యక్రమాలు, పటిష్టమైన నిఘా సమాచార భాగస్వామ్యం ద్వారా తనకు క్షేత్రస్థాయిలో లభించిన అనుభవాన్ని ఏడీఎంఎం-ప్లస్ భాగస్వామ్య దేశాలతో పంచుకునేందుకు భారత్ పూర్తిగా సిద్ధంగా ఉందని తెలిపారు. తద్వారా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ఉమ్మడి సామర్థ్యాలను బలోపేతం చేయవచ్చని చెప్పారు. ఏడీఎంఎం-ప్లస్ వ్యవస్థలో ఉగ్రవాద వ్యతిరేక పోరాటం కీలక సహకార రంగంగా కొనసాగుతోందని ఆయన వివరించారు. 2024 నుంచి 2027 వరకు ఉగ్రవాద వ్యతిరేక నిపుణుల కార్యాచరణ బృందానికి భారత్, మలేషియా సంయుక్తంగా అధ్యక్షత వహిస్తున్నాయని తెలిపారు.

ఆసియాన్ కూటమికి భారత్ అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. శాంతి, స్థిరత్వం కేవలం ఆకాంక్షలుగా మిగలకుండా, దేశాల ఉమ్మడి నిబద్ధతతో సాధ్యమయ్యేలా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన, సమ్మిళిత, సంక్షోభాలను తట్టుకోగల, నిబంధనల ఆధారిత ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆసియాన్‌తో భారత్ వ్యూహాత్మక సంబంధాలు దీర్ఘకాలిక దృక్పథంతో కొనసాగుతున్నాయని, ఉమ్మడి ప్రయోజనాలు, పరస్పర గౌరవం, ఆచరణాత్మక సహకారంపై అవి ఆధారపడి ఉన్నాయని తెలిపారు. గత ఏడాది అక్టోబర్‌లో కౌలాలంపూర్‌లో జరిగిన రెండో భారత్ -ఆసియాన్ రక్షణ మంత్రుల అనధికారిక సమావేశాన్ని ఆయన గుర్తుచేశారు. భారత్-ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో రక్షణ, భద్రత అంశాలను మరింత ముందుకు తీసుకెళ్లడంతో పాటు, 2026-2030 కాలానికి సంబంధించిన భారత్-ఆసియాన్ కార్యాచరణ ప్రణాళిక అమలుపై నిబద్ధతను ఆ సమావేశం చాటుకుందని వివరించారు.

13వ ఏడీఎంఎం-ప్లస్ సమావేశం ఇతివృత్తమైన "కలిసికట్టుగా మన భవిష్యత్తును తీర్చిదిద్దుకుందాం"ను ప్రస్తావిస్తూ... భారత్ విదేశాంగ, రక్షణ విధానాలతో పాటు, 'సర్వే భవంతు సుఖినః' (నకల ప్రాణులు సుఖంగా ఉండాలి) అనే భారతీయ నాగరికతా స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలందరూ సంతోషంగా, సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలనే ఆకాంక్ష ను ఈ భావన తెలియజేస్తుందని పేర్కొన్నారు. "మనందరినీ కలిపి ఉంచే ఐక్యత, భౌగోళిక, ఆర్థిక, వ్యూహాత్మక వైవిధ్యాలను ఉమ్మడిగా సద్వినియోగం చేసుకునే సామర్థ్యమే మనకు గొప్ప బలం. పరస్పర విశ్వాసం, సహకారం, సమష్టి బాధ్యతపై ఆధారపడిన అంతర్జాతీయ వ్యవస్థను భారత్ విశ్వసిస్తుంది. శాంతి, క్రమబద్ధతకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఈ సహకార స్ఫూర్తే మనకు శక్తినిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు.

2026లో భారత్-ఆసియాన్ సంబంధాల్లో నౌకా వాణిజ్య సహకారం అత్యంత కీలకమని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. 2026ను 'భారత్-ఆసియాన్ సముద్ర సహకార సంవత్సరంగా' న్యూఢిల్లీ ప్రకటించడం, రెండో భారత్-ఆసియాన్ సముద్ర విన్యాసాన్ని నిర్వహించడం ఈ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ సముద్ర చట్టంలోని సూత్రాలను భారత్ కేవలం ప్రచారం చేయడమే కాకుండా, సముద్ర భద్రతకు సంబంధించిన అంతర్జాతీయ చట్టాలను నిబద్ధతతో అమలు చేస్తోందని స్పష్టం చేశారు. "నౌకాయాన స్వేచ్ఛను నిర్ధారించడం, అంతర్జాతీయ సముద్ర వాణిజ్య మార్గాలను పరిరక్షించడం పట్ల భారత్ నిబద్ధతకు దశాబ్దాలుగా కొనసాగుతున్న కార్యాచరణ అనుభవం ఆధారంగా ఉంది. 2008 నుంచి గల్ఫ్ ఆఫ్ ఏడెన్ వంటి అత్యంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సముద్ర మార్గాల్లో భారత నౌకాదళం నిరంతరంగా చురుకైన ఉనికిని కొనసాగిస్తోంది. ఇతర దేశాల హక్కులకు భంగం కలిగించే బలవంతపు చర్యలకు లేదా ఏకపక్ష చర్యలకు భారత్ పాల్పడటం లేదు" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

ముందుండి పనిచేసే యుద్ధనౌకలను మోహరించడం ద్వారా భారత్ వేలాది వాణిజ్య నౌకలకు సురక్షితంగా ప్రయాణించేందుకు సహకరించిందని, సముద్రంలో నౌకలను అపహరించే డజన్ల కొద్దీ యత్నాలను అడ్డుకుందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. నౌక ఏ దేశానికి చెందినదనే బేధం లేకుండా వాణిజ్య నౌకాయానానికి రక్షణ కల్పించినట్లు వివరించారు. వాణిజ్య నౌకాయాన భద్రతను భారత్ తన బాధ్యతగా భావిస్తోందని ఆయన పేర్కొన్నారు. "ప్రపంచ వాణిజ్య మార్గాలు సంక్లిష్టమైన అంతర్జాతీయ ముప్పులను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ మాటలకే పరిమితం కాకుండా కార్యాచరణకు సిద్ధంగా ఉంది. సమర్థవంతమైన చర్యలు, సముద్ర ప్రాంతాల్లో నిరంతర కార్యాచరణ ఉనికి, అంతర్జాతీయ సహకారం అవసరం. హిందూ మహాసముద్ర ప్రాంతంతో పాటు విస్తృత ఇండో-పసిఫిక్ ప్రాంతంలో విశ్వసనీయమైన భద్రతా భాగస్వామిగా భారత్ తన పాత్రను కొనసాగిస్తుంది" అని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

నౌకా వాణిజ్య భద్రత అనేది విస్తృత ప్రాంతంలోని భద్రత, శ్రేయస్సుతో నన్నిహితంగా ముడిపడి ఉందని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. చట్టబద్ధ పాలనకు, ముఖ్యంగా ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందానికి భారత్ అత్యంత ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. నౌకాయాన స్వేచ్ఛ, గగనతలం మీదుగా ప్రయాణించే స్వేచ్ఛకు భారత్ ఇస్తున్న మద్దతు ఏ దేశానికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. స్వేచ్ఛాయుత సముద్ర మార్గాలు, స్థిరమైన సముద్ర పాలనపై ఆధారపడే ప్రాంతీయ భాగస్వాములందరి ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించడమే దీని లక్ష్యమని వివరించారు. సముద్ర భద్రత, శోధన, రక్షణ చర్యలు, మానవతా సహాయం, వృత్తిపరమైన పరస్పర సంబంధాలు, సామర్థ్యాల పెంపు, అంతర్జాతీయ చట్టాలకు భారత్ తగిన గౌరవం ఇస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఆసియాన్ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేయడానికి భారత్ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. భారత్-ఆసియాన్ రక్షణ సహకారాన్ని బలోపేతం చేయడంలో యువత భాగస్వామ్యం కీలకమని రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ఇరు పక్షాల్లో యువ జనాభా ఎక్కువగా ఉండటం, వారి ఆకాంక్షలు ఒకే విధంగా ఉండటం ప్రాంతీయ భాగస్వామ్యాన్ని మరింతగా పెంపొందించేందుకు బలమైన పునాదిని అందిస్తాయని తెలిపారు. సంస్థాగతంగా ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ఏడీఎంఎం-ప్లస్ కార్యక్రమాలకు అనుగుణంగా సామర్థ్యాల పెంపునకు దోహదపడటం లక్ష్యంగా ప్రత్యేక రక్షణ రంగ 'యూత్ బ్రిడ్జ్' ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

అనంతుల లక్ష్మీనారాయణ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

-మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం, అక్టోబర్ 30: పాల్వంచలో హెచ్‌పీ గ్యాస్ మేనేజర్‌గా పనిచేసిన అనంతుల లక్ష్మీనారాయణ మృతి పట్ల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం నిర్వహించిన దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న వారు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చారు. శిక్షార్హులైన వారెవరినీ ఉపేక్షించకుండా చట్టం తన పని తాను చేసుకుపోతుందని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అనంతుల లక్ష్మీనారాయణకు 18 అవార్డులు లభించాయని, దక్షిణ భారతదేశ స్థాయిలోనే ఉత్తమ గుర్తింపు పొందారని, జాతీయ స్థాయి అవార్డు సాధించాలన్నది ఆయన కలగా ఉండేదని కుటుంబ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వారు తమ ఆవేదనను వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరే ఉద్యోగికీ ఇలాంటి అన్యాయం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, సంబంధిత శాఖాపరమైన అంశాలపై కూడా అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, పాల్వంచ తహసీల్దార్ ధారా ప్రసాద్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్ వజ్రమ్మకు కేటీఆర్ అభినందనలు

చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలి



నల్గొండ, అక్టోబర్ 29: ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కర్నాటి వజ్రమ్మ వెంకటేశం, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేటీఆర్ కర్నాటి వజ్రమ్మ వెంకటేశంను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

ఏడు దశాబ్దాల తర్వాత ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, ఈ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్న తొలి తెలంగాణ మహిళగా వజ్రమ్మ నిలిచారని కేటీఆర్ అభినందించారు. చేనేత కళాకారులు తయారుచేసిన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు, జాతీయ స్థాయిలో మార్కెటింగ్ అవకాశాలు కల్పించే దిశగా వజ్రమ్మ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బండారు చంద్రయ్య, గంజి కృష్ణయ్య, కర్నాటి గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి బోనం.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన

17వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె



నల్గొండ, అక్టోబర్ 29: ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె గురువారం 17వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నల్గొండ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు అమ్మవారికి బోనం సమర్పించి వినూత్నంగా నిరసన తెలిపారు.తమను బేషరతుగా క్రమబద్ధీకరించి, న్యాయం చేయాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఉద్యోగులందరినీ బేషరతుగా క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మైక్రోబయాలజిస్ట్ ఉపేందర్, డాక్టర్ ప్రియాంక, ఆడియాల జిస్టులు అనిల్, సంతోష్, డాక్టర్ వెంకటేశం, ల్యాబ్ టెక్నీషియన్లు నరేష్, మౌనిక,డీఈఓ ఓమల్లికార్జున్, ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ అధికారులు, ఏఎన్ఎంలు, పలువురు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
సి హెచ్ సి,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



వరంగల్, అక్టోబర్ 30:: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన నాణ్యమైన వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు.

శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సి హెచ్ సి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్పిటల్ కి ప్రతిరోజు ఎంతమంది ఓపి సేవల నిమిత్తం వస్తుంటారని, పేషెంట్ల వివరాలు ఆన్లైన్లో నమోదు చేస్తున్నారా అని వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆరోగ్య కేంద్రంలోని మేల్, ఫిమేల్ వార్డులను, ఓపి నమోదును కలెక్టర్ పరిశీలించారు. టీకాల గది, మెడికల్ రికార్డు విభాగం, మెడికల్ స్టోర్ ను తనిఖీ చేశారు.

ఆసుపత్రిలో వైద్యులు సిబ్బంది హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకుని రిజిస్టర్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ? రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకం పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.

వైద్య సేవల నిమిత్తం వచ్చే రోగులకు ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పేషంట్లకు అవసరమైన అన్ని నదుపాయాలు ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.మందుల నిర్వహణ సరిగ్గా ఉండాలన్నారు

రాయపర్తి కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక

పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి-ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



వరంగల్, అక్టోబర్ 30:: మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రూన్సీరెడ్డి ప్రకటించారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి, శాలువాలతో సత్కరించారు.

నూతన కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కందికట్ల యాకయ్య, బీసీ సెల్ అధ్యక్షుడిగా చెవ్వ కాశీనాథం, వైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎండీ అప్రోజ్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా ఖమ్మం సోమన్న, ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా మునావత్ కిషన్ నాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కౌడగాని ఉమా నియమితులయ్యారు. ఉపాధ్యక్షులుగా గిరిగాని రాజు, మచ్చ నీలయ్య, వెంకటేష్, ఎం. సరిత, ఎండీ అబ్దుల్, పాశం నరోత్తంరెడ్డి, మంద యాకన్న, చిన్నపాక గారే చిన్న సాయిలు,ప్రధాన కార్యదర్శులుగా కుందూరు జైపాల్‌రెడ్డి, జక్కుల సారంగం, సన్నూరి మహిబా, గూగులోతు యాకుబ్,కార్యదర్శులుగా మద్దెల సోమయ్య, మునావత్ సీతారాం, గౌరవ అధ్యక్షులుగా దేవేందర్ నాయకులు, మండల పార్టీ ముఖ్య నాయకులు, స్థానిక నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ముగిసిన డీఏఈ విజిలెన్స్ మీటింగ్

న్యూఢిల్లీ, అక్టోబర్ 30:విజిలెన్స్ అవగాహన ప్రచార కార్యక్రమం? 2026లో భాగంగా, అణుశక్తి శాఖ (డీఏఈ) ఆధ్వర్యంలో విజిలెన్స్ సమ్మేళనం అక్టోబర్ 28, 2026న హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ)లో ఉన్న హోమీ భాభా కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. హైదరాబాద్‌లోని డీఏఈ విభాగాలైన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ (ఎన్ఎఫ్‌సీ), ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), అటామిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ (ఏఎండీ), టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్ఆర్), బార్క్‌కు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ కంపోజిషనల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ మెటీరియల్స్ (ఎన్‌సీసీఎంఎం) సంయుక్తంగా ఈ సమ్మేళనాన్ని నిర్వహించాయి.

పాలనలో నిజాయితీ, నివారణాత్మక విజిలెన్స్, పారదర్శకత, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పరిపాలనా విధానాల ద్వారా జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం, నైతిక విలువలను పెంపొందించడం వంటి అంశాలకు ఈ సమ్మేళనం ప్రాధాన్యమిచ్చింది.

అణుశక్తి కమిషన్ ఛైర్మన్, అణుశక్తి శాఖ కార్యదర్శి డాక్టర్ అజిత్ కుమార్ మొహంతీ తన వీడియో సందేశంలో దేశ ఇంధన భద్రతను సాధించడం, 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో శాఖ నిబద్ధతను వివరించారు. విజిలెన్స్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) వినియోగం, ఆన్‌లైన్ హాజరు వ్యవస్థలు, ఇతర సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత వేదికల అమలును ఆయన నొక్కిచెప్పారు.

అవినీతిని అరికట్టడంలో సమష్టి బాధ్యత, నిజాయితీ, పారదర్శకత ప్రాముఖ్యతను ఈ సమ్మేళనం ప్రధానంగా ప్రస్తావించింది. ఉద్యోగులకు అవగాహన కల్పించడం, నిబంధనలను కచ్చితంగా పాటించడం, కొనుగోలు ప్రక్రియలను బలోపేతం చేయడం, నాయకత్వ నిబద్ధత వంటి అంశాలను నివారణాత్మక విజిలెన్స్‌లో కీలకమైనవిగా చర్చించారు. పారదర్శకమైన, జవాబుదారీ సంస్థల నిర్మాణానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని నైతిక విలువలతో సమన్వయం చేయాల్సిన అవసరాన్ని కూడా ఈ కార్యక్రమం స్పష్టం చేసింది.

విజిలెన్స్‌పై అవగాహన పెంపొందించడం, సుపరిపాలనకు సంబంధించిన అంశాలపై చర్చించేందుకు నిపుణులు సాంకేతిక ప్రసంగాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్‌సీ ఛైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్; ఏఎండీ డైరెక్టర్ శ్రీ ధీరజ్ పాండే; కేంద్ర విజిలెన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్, కన్సల్టెంట్ శ్రీ రాజీవ్ వర్మ; ఈసీఐఎల్ డైరెక్టర్ (పర్సనల్) శ్రీ వి.ఏ.ఎన్. కన్నెన్; హైదరాబాద్ టీఐఎఫ్ఆర్ కేంద్ర డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. కృష్ణమూర్తి; ఎన్‌సీసీసీఎం?బార్క్ అధిపతి డాక్టర్ కె. దాస్; ఈసీఐఎల్, యూసీఐఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీ పి. కృష్ణ కుమార్, ఐటీఎస్; ఎన్ఎఫ్‌సీ జనరల్ మేనేజర్, విజిలెన్స్ అధికారి శ్రీ శిరీష్ రఘునాథరావు బిబావే తదితరులు పాల్గొన్నారు.

ఛార్జింగ్‌లో ఉండగానే..ఫోన్ పేలడంతో చెలరేగిన మంటలు..

అమరావతి, అక్టోబర్ 29: ప్రకాశం జిల్లాలో సెల్‌ఫోన్ పేలుడు కలకలం రేపింది. ఛార్జింగ్ పెట్టిన మొబైల్ ఫోన్ ఒక్కసారిగా పేలడంతో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటన గుడ్లూరు మండలం పాజర్ల గ్రామంలో చోటుచేసుకుంది. మంటల ధాటికి ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. గోడలకు సైతం బీటలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

స్థానికుల వివరాల ప్రకారం.. పాజర్ల గ్రామానికి చెందిన తిరుమల అనే వ్యక్తి తన సెల్‌ఫోన్‌కు ఛార్జింగ్ పెట్టి పనికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేలోపు ఛార్జింగ్‌లో ఉన్న ఫోన్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో ఇంట్లో మంటలు చెలరేగి వేగంగా వ్యాపించాయి.

సెల్‌ఫోన్ పేలుడుతో చెలరేగిన మంటల కారణంగా ఇంట్లోని వలు వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. గోడలకు బీటలు రావడంతో ఇంటికి నష్టం వాటిల్లింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. దీంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

ఛార్జింగ్‌లో ఉన్న సెల్‌ఫోన్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. అయితే పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

క్రీడలతో విద్యార్థులకు మానసిక ఒత్తిడి దూరం

శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది
జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్

నిజామాబాద్, అక్టోబర్ 30:క్రీడలతో విద్యార్థులకు మానసిక ఒత్తిడి దూరమవడంతో పాటు ఆత్మవిశ్వాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికా ర్జున్ అన్నారు. గురువారం న్యూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన మండలస్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలనే ఉద్దేశంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించిన వారికి క్రీడా కోటా కింద ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల జీవితంలో ముఖ్యమైన భాగమని అన్నారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు కోకో, కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో కొనసాగుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రామస్వామి, ఎంపీడీవో భరత కుమార్, క్రీడా దాతలు భూపాల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, వినోద్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సంజీవులు, బ్రాహ్మణపల్లి సర్పంచ్ రాజా గౌడ్, కంకల్ సర్పంచ్ మైలారం రవీందర్‌రెడ్డి, తాడ్వాయి సింగిల్ విండో చైర్మన్ సుధాకర్ రావు, దెమే సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచులు ఏనుగు ప్రభాకర్‌రెడ్డి, మహేష్, వ్యాయామ ఉపాధ్యాయులు నగేష్, కాంప్లెక్స్ ఉపాధ్యా యులు సంగారెడ్డి, రామచంద్రరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారతీయ ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండు.. స్వచ్ఛ ఇంధన లక్ష్యాలను వివరించిన శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:భారత పారిశ్రామిక రంగంలో పరివర్తనకు నాణ్యత, భారీ స్థాయిలో ఉత్పత్తి, ప్రపంచ మార్కెట్లలో ప్రవేశం, సమ్మిళిత వృద్ధి కీలకమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రైవేటు రంగం, విద్యాసంస్థల మధ్య సహకారం ద్వారా ఆవిష్కరణలు సాధ్యమవుతాయని తెలిపారు. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ స్టడీస్ ఇనిస్టిట్యూట్ (ఐఎన్ఐడీ), ఐడీఆర్ఏ సంయుక్తంగా నిర్వహించిన నాలుగో జాతీయ పారిశ్రామిక పరివర్తన సదస్సులో కేంద్రమంత్రి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన తయారీ రంగ దేశంగా భారత్ ఎదగాలని పిలుపునిచ్చారు.

భారత పారిశ్రామిక రంగంలో వేగవంతమైన మార్పులకు నాణ్యత, ప్రపంచ మార్కెట్లలో ప్రవేశం, భారీ స్థాయిలో ఉత్పత్తి, సమ్మిళిత వృద్ధి అనే నాలుగు అంశాలు కీలకమని శ్రీ పీయూష్ గోయల్ వివరించారు. నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెబుతూ.. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్న 'జీరో డిఫెక్ట్.. జీరో ఎఫెక్ట్' విధానాన్ని గుర్తుచేశారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో, భారత్ తన మార్కెట్ వాటాను పెంచుకోవాలని, అంతర్జాతీయ మార్కెట్లలో తన ఉనికిని విస్తరించాలని, ప్రాధాన్య వాణిజ్య అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.140 కోట్ల జనాభా కలిగిన దేశీయ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లలోకి ప్రవేశం లభించడం వల్ల తయారీదారులు తక్కువ ధరలకు ఉత్పత్తులను అందించడంతోపాటు పోటీతత్వంతో కూడిన ఉత్పత్తి వ్యయాలను సాధించగలరని ఆయన తెలిపారు. దేశంలోని ప్రజలందరికీ విస్తృత ప్రయోజనాలు చేకూరేలా సుస్థిరమైన, సమ్మిళిత వృద్ధిని సాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

2047 నాటికి వికసిత్ భారత్ దార్శనికత 140 కోట్ల మంది భారతీయుల ఉమ్మడి సంకల్పమని కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. ఈ లక్ష్య సాధనకు ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకోవాలని, ప్రస్తుత పరిస్థితులను వాస్తవికంగా అంచనా వేసుకోవాలని, భవిష్యత్తు కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొం దించుకోవాలని సూచించారు. తరతరాల మధ్య సహకారం ప్రాముఖ్యతను వివరిస్తూ, సమకాలీన సవాళ్లను పరిష్కరించేందుకు సీనియర్ నిపుణుల అనుభవం, యువతలోని ఉత్సాహం కలిసిరావాలని ఆయన అన్నారు. విభిన్న విభాగాలు విడివిడిగా పనిచేయడం కాకుండా, సమష్టిగా కృషి చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు.

భారత్ అనుసరిస్తున్న వాణిజ్య విధానంపై శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇతర దేశాలతో భారత్ కుదుర్చుకునే వాణిజ్య ఒప్పందాలు కేవలం దిగుమతి సుంకాలను తగ్గించడం, వస్తువుల మూల దేశాన్ని నిర్ధారించే నిబంధనలు రూపొందించడం, మార్కెట్లలో ప్రవేశం పొందడం వంటి అంశాలకే పరిమితం కావని తెలిపారు. భారత్‌కు పోటీ సామర్థ్యం ఉన్న రంగాలను గుర్తించడం, ఎగుమతులకు కొత్త అవకాశాలను కల్పించడం, కీలక రంగాల ప్రయోజనాలను కాపాడటం ఈ ఒప్పందాల్లో భాగమని వివరించారు. దేశ అభివృద్ధికి అవసరమైన అధునాతన సాంకేతిక ఉత్పత్తులు, గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లు (జీపీయూలు), మెమరీ సాంకేతికత, వైద్య సాంకేతిక పరికరాలు తదితర వస్తువులను పొందేందుకు కూడా ఈ ఒప్పందాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

భారత్ చేపడుతున్న వాణిజ్య చర్చల్లో సేవారంగం, పెట్టుబడులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక భాగస్వామ్యాలు, వాతావరణ లక్ష్యాల సాధనకు సహకారం వంటి అంశాలు కూడా ఉంటాయని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. వాతావరణ మార్పులపై ప్రతి దేశం నిర్దేశించుకున్న జాతీయ లక్ష్యాల సాధనకు పరస్పర సహకారానికి కూడా ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ఒప్పందాలను ఖరారు చేయడానికి ముందే వివిధ రంగాల భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన వివరించారు. దేశానికి సంబంధించిన కీలక ప్రయోజనాలు, సున్నితమైన రంగాలు, రక్షణాత్మక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా దేశ ప్రయోజనాలను కాపాడుతూనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో భారత్ అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలను ప్రస్తావిస్తూ.. ఒప్పందానికి సంబంధించిన వివరాలు వెల్లడైనప్పుడు రైతులు, ఇతర భాగస్వాముల కీలక ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగలేదని దేశ ప్రజలు గుర్తిస్తారని శ్రీ పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం వల్ల అంతర్జాతీయ వాణిజ్యంలో భారత్‌కు గణనీయమైన పోటీతత్వ ప్రయోజనం లభిస్తుందని తెలిపారు.

వాణిజ్యం అనేది కేవలం సంపూర్ణ గణాంకాలపై ఆధారపడేది కాదని.. ఏ రంగంలో ఏ దేశానికి ఎక్కువ సామర్థ్యం, పోటీతత్వం ఉందనే అంశాలపై ఆధారపడి ఉంటుందని కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ వివరించారు. అనేక అభివృద్ధి చెందిన దేశాలు శ్రమ ఆధారిత ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాలు విధించేలా తమ వాణిజ్య విధానాలను రూపొందిం చుకున్నాయని తెలిపారు. ఈ సుంకాలను వాణిజ్య చర్చల్లో బేరసారాల సాధనాలుగా ఉపయోగిస్తున్నాయని పేర్కొన్నారు.

భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలు 38 అభివృద్ధి చెందిన, సాపేక్షంగా సంపన్నమైన దేశాలతో వాణిజ్య సంబంధాలను బలోపేతం చేస్తున్నాయని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా ఇరు పక్షాలకు పరస్పర ప్రయోజనాలు కలిగే అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఆయా దేశాలకు అవసరమైన ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేయడం తోపాటు, దేశ అభివృద్ధికి అవసరమైన వస్తువులను దిగుమతి చేసుకునే అవకాశం లభిస్తుందని వివరించారు. ఇరు పక్షాలకు ప్రయోజనం చేకూర్చే ఈ భాగస్వామ్యాలు న్యాయబద్ధంగా, సమానంగా, సమతుల్యంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రస్తుత ప్రభుత్వం కుదుర్చుకున్న తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య, ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల ద్వారా మొత్తం 60 ట్రిలియన్ అమెరికన్ డాలర్ల స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) కలిగిన ఆర్థిక వ్యవస్థల్లో ప్రాధాన్య వాణిజ్య అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. 2014కు ముందు కుదుర్చుకున్న ఒప్పందాల పరిధిలోని ఆర్థిక వ్యవస్థల మొత్తం జీడీపీ 10 ట్రిలియన్ డాలర్లు మాత్రమేనని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఒప్పందాలు ప్రధానంగా భారత్‌తో పోటీపడే దేశాలతో ఉండేవని, ప్రస్తుత విధానం మాత్రం పరస్పర అవసరాలు, ఆర్థిక సంబంధాలను పెంపొందించడంపై దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.

భారతీయ ప్రతిభ, నైపుణ్యాలకు అంతర్జాతీయంగా గుర్తింపు పెరుగుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. భారత్-జర్మనీ వలస ఒప్పందం, ఏటా 90 వేల మంది భారతీయుల అవసరంపై జర్మనీ విదేశాంగ మంత్రితో జరిగిన సంభాషణను ఆయన గుర్తుచేసుకున్నారు. జర్మనీకి అంతకంటే ఎక్కువ సంఖ్యలో భారతీయ ప్రతిభావంతుల అవసరం ఉందని ఆ దేశ విదేశాంగ మంత్రి తనతో చెప్పినట్లు తెలిపారు. ఫార్చ్యూన్ 500 జాబితాలోని ప్రముఖ కంపెనీల్లో ఉన్నత పదవుల్లో భారతీయ నిపుణులు పనిచేస్తుండటం, అత్యాధునిక సాంకేతిక అభివృద్ధిలో భాగస్వాములవుతుండటం భారతీయ శ్రామిక శక్తి సామర్థ్యాలకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.

భారతీయ ప్రజల్లోని ప్రతిభ, నైపుణ్యాలు, ఉత్సాహం కారణంగా రానున్న మరో 20 నుంచి 25 ఏళ్ల పాటు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ కొనసాగుతుందని శ్రీ పీయూష్ గోయల్ విశ్వాసం వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పులపై చర్యలు తీసుకునేటప్పుడు 'కాలుష్యం కలిగించిన వారే దాని పరిహార వ్యయాన్ని భరించాలి' అనే సూత్రంతోపాటు, 'ఉమ్మడి కానీ భిన్నమైన బాధ్యతలు' అనే సూత్రాన్ని అనుసరించాలని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు తగిన ఆర్థిక, సాంకేతిక సహకారం అందించాల్సిన అవసరం ఉందని అన్నారు. భారత్‌లో ప్రస్తుతం ఏర్పాటు చేసిన మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో 60 శాతం హరిత, పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి వస్తోందని తెలిపారు. అయినప్పటికీ దేశ ఇంధన భద్రతను కాపాడటానికి, ప్రజలకు అందుబాటు ధరల్లో విద్యుత్ సరఫరా చేయడానికి బొగ్గు కూడా అత్యవసరమని పేర్కొన్నారు.

ఇతర దేశాల్లో తయారైన ఉత్పత్తులను కొనుగోలు చేసే ప్రధాన దేశంగా ఉన్న భారత్.. ప్రస్తుతం స్వయంగా ఉత్పత్తులు తయారు చేసే దేశంగా అంతర్జాతీయ గుర్తింపు పొందుతోందని కేంద్ర మంత్రి శ్రీ పీయూష్ గోయల్ పేర్కొన్నారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం, వివిధ రంగాల్లో దశలవారీగా అమలు చేసిన తయారీ కార్యక్రమాల ద్వారా పరిశ్రమలు భారత్‌లో తమ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు, దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడిందని తెలిపారు. భవిష్యత్తులో దేశ అవసరాల్లో మరింత ఎక్కువ భాగాన్ని దేశీయంగానే తయారు చేసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

భారత పారిశ్రామిక రంగంలో పరివర్తనకు ఆవిష్కరణలు కీలకమని శ్రీ పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రధానంగా ప్రైవేటు రంగానికి సహాయకారిగా, ఆవిష్కరణలను ప్రోత్సహించే ఉత్ప్రేరకంగా వ్యవహరిస్తూ.. ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఐఐటీలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఇతర ఉన్నత విద్యా సంస్థల్లో అందుబాటులో ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానం, ఆవిష్కరణలు, పరిశోధనా సామర్థ్యాలను ఆయన ప్రస్తావించారు.

అంకుర సంస్థలకు నిధులు సమకూర్చేందుకు ఏర్పాటు చేసిన 'స్టార్టప్ ఫండ్ ఆఫ్ ఫండ్స్' గురించి ప్రస్తావిస్తూ.. తొలి నిధిని పూర్తిగా వినియోగించామని, ప్రస్తుతం రెండో నిధి కూడా అందుబాటులోకి వచ్చిందని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. భారత్‌లో పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల నిధి (ఆర్‌డీఐఎఫ్) గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ కార్యక్రమాలు దేశంలో అంకుర సంస్థల వ్యవస్థ అభివృద్ధికి దోహదపడ్డాయని, ఫలితంగా ప్రపంచంలోనే మూడో అతిపెద్ద అంకుర సంస్థల వ్యవస్థగా భారత్ ఎదిగిందని పేర్కొన్నారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడంపై కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ప్రస్తుత అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ 8.4 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉందని, 2033 నాటికి అది 44 బిలియన్ డాలర్లకు చేరుకునే సామర్థ్యం ఉందని తెలిపారు. అంతరిక్షం, కృత్రిమ మేధ, కంప్యూటింగ్, స్టార్టప్ రంగాల్లో భారత్‌తో కలిసి పనిచేసేందుకు అంతర్జాతీయ భాగస్వాములు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

ఇటీవల జర్మనీలో పర్యటించిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అక్కడ కొన్ని పరిశోధనా సంస్థల్లో 12 వేల నుంచి 30 వేల మంది వరకు పనిచేస్తున్నారని, ఆ సంస్థలు ప్రైవేటు రంగంతో సన్నిహితంగా కలిసి పనిచేస్తున్నాయని శ్రీ పీయూష్ గోయల్ తెలిపారు. భారత్‌తో కలిసి పరిశోధనలు, ఇతర కార్యక్రమాలు చేపట్టేందుకు అవి ఆసక్తి వ్యక్తం చేశాయని చెప్పారు. భారత్?జర్మనీ భాగస్వామ్యంపై ఉన్న విశ్వాసం, ప్రతిభ, నైపుణ్యాలు, న్యాయబద్ధమైన వ్యవహారశైలి, సమాన అవకాశాల విషయంలో భారత్‌పై ఉన్న నమ్మకం ఈ ఆసక్తికి కారణమని ఆయన పేర్కొన్నారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో కొత్త వాణిజ్య ఒప్పందాలు, అంతర్జాతీయ సంబంధాల అభివృద్ధి ద్వారా ఉమ్మడి పరిశోధనలు, సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. దేశీయ సామర్థ్యాలను అంతర్జాతీయ నైపుణ్యం, పెట్టుబడులతో సమన్వయం చేయడం ద్వారా భారత్ వృద్ధి ప్రస్థానాన్ని ఈ భాగస్వామ్యాలు కొత్త దిశలోకి తీసుకెళ్లగలవని అన్నారు.

భారత పారిశ్రామిక రంగ భవిష్యత్తుపై మూడు రోజుల పాటు చర్చలను నిర్వహించినందుకు ఐఎస్ఐడీని శ్రీ పీయూష్ గోయల్ అభినందించారు. నాణ్యత, ప్రపంచ మార్కెట్లకు అందుబాటు, భారీ స్థాయి ఉత్పత్తి ద్వారా కలిగే ప్రయోజనాలు, సమ్మిళిత వృద్ధిపై నిరంతర దృష్టి సారించడంతోపాటు, తయారీ, ఆవిష్కరణలు, పరిశోధన రంగాల మధ్య సహకారం భారత పారిశ్రామిక పరివర్తనకు కీలకమని ఆయన తెలిపారు. వికసిత్ భారత్?2047 లక్ష్య సాధనకు తమ వంతు కృషి చేస్తున్న సదస్సు నిర్వాహకులు, పాల్గొన్న ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు 21 రకాల సదుపాయాలు 100 శాతం అందేలా చూడాలి

నిజామాబాద్, అక్టోబర్ 30:తాడ్వాయి మండలంలోని మండల వనరుల కేంద్రాన్ని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో సందర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేస్తున్న అవసర వస్తువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు పంపిణీ చేయాల్సిన యూనిఫాం వస్త్రాలు, ఐడీ కార్డులు, బెల్టులు, బ్లాక్ షూస్

ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా రూ. 18,690 కోట్లకు పైగా ఆర్థిక సహాయాన్ని పొందనున్న 9.34 కోట్లకు పైగా రైతులు

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 30:ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) 24వ విడత నిధులను రేపు (30 అక్టోబర్ 2026న) గుజరాత్‌లోని బనస్కాంతలో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ విడుదల చేయనున్నారు. ఈ విడతలో దేశవ్యాప్తంగా 9.34 కోట్లకు పైగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 18,690 కోట్లకు పైగా సొమ్ము నేరుగా జమ కానుంది. ఇది రైతుల సంక్షేమం, వారి ఆర్థిక సాధికారత పట్ల కేంద్ర ప్రభుత్వానికి ఉన్న గట్టి నిబద్ధతను తెలియజేస్తోంది.

రైతుల ఆదాయ మార్గాలను మెరుగుపరచడం.. వ్యవసాయ నిల్వ, ప్రాసెసింగ్ సదుపాయాలను పెంచేందుకు 'వ్యవసాయ మౌలిక వనతుల నిధి' (ఏఐఎఫ్) కింద ఏర్పాటుచేసిన 521 ప్రాజెక్ట్ యూనిట్లను ప్రధానమంత్రి జాతికి అంకితం చేయనున్నారు. అధిక లాభదాయకమైన ఉద్యానవన పంటలను ప్రోత్సహించడానికి, రైతుల ఆదాయ సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉద్దేశించిన 12 ఉద్యానవన క్లస్టర్లను ప్రారంభించనున్నారు.

మధ్యప్రదేశ్‌లోని రైసేన్ వేదికగా జరిగే పీఎం-కిసాన్ 24వ విడత నిధుల విడుదల కార్యక్రమంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొంటారు. పెద్ద సంఖ్యలో స్థానిక రైతులు పాల్గొననున్న ఈ కార్యక్రమం పీఎం-కిసాన్, మంత్రిత్వ శాఖ చేపట్టిన ఇతర కీలక ప్రాజెక్టుల ప్రాముఖ్యతను ప్రముఖంగా వివరించడానికి.. రైతుల సంక్షేమం, సమృద్ధి, సాధికారత పట్ల ప్రభుత్వ నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటించడానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలవనుంది.

పీఎం-కిసాన్ పథకంలో ఇంతవరకు 23 విడతల ద్వారా అర్హులైన రైతులకు రూ. 4.47 లక్షల కోట్లకు పైగా నిధులు అందాయి. ఈ పథకం అర్హత కలిగిన రైతు కుటుంబాలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా ఆర్థిక సాయాతనిస్తూ వారి వ్యవసాయ, గృహావసరాలను తీర్చుకోవడానికి.. జీవనోపాధి భద్రతకు తోడ్పడుతోంది.

కోట్లాది మంది రైతుల జీవనోపాధికి ఆధారంగా నిలుస్తూ దేశ ఆహార, పోషకాహార భద్రతను నిర్ధారిస్తున్న వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలుస్తోంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో వ్యవసాయ రంగంలో స్వయంసమృద్ధి లక్ష్యాన్ని సాధించడమే ధ్యేయంగా రైతుల ఆదాయాలను పెంచేందుకు, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం గత 12 ఏళ్లలో అనేక కీలక కార్యక్రమాలను చేపట్టింది.

వీటిలో ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్), ప్రధాన్ మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), కిసాన్ క్రెడిట్ కార్డ్ (కేసీసీ), కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' వంటివి అత్యంత కీలక మైనవి. రైతుల సమగ్ర సాధికారత కోసం ఆర్థిక సహాయం అందించడం, పంట నష్ట భయాన్ని తగ్గించడం, వ్యవసాయ రుణ సదుపాయాన్ని సులభతరం చేయడం, సాంకేతిక ఆధారిత వ్యవసాయ యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించటమే ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమాలు చేపట్టారు.

జాతీయ వంటనూనెల మిషన్, పప్పుధాన్యాల ఆత్మనిర్భరత మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధిని ప్రభుత్వం మరింత ముందుకు తీసుకెళ్తోంది. జాతీయ సహజ సేద్య మిషన్.. దేశవ్యాప్తంగా క్లస్టర్లను అభివృద్ధి చేయడం ద్వారా నిలకడైన సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంబించేలా రైతులను ప్రోత్సహిస్తోంది.

రైతుల ఆదాయాలను పెంచడంలో పంట కోత అనంతర యాజమాన్యం, వ్యవసాయ మౌలిక సదుపాయాల ప్రాముఖ్యతను గుర్తించిన ప్రభుత్వం.. వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (ఏఐఎఫ్-అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) ద్వారా నిల్వ కేంద్రాలు, శీతలీకరణ నిల్వ సదుపాయాలు, ప్రాథమిక ప్రాసెసింగ్ కేంద్రాలు, ఇతర అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులను ప్రోత్సహిస్తోంది. ఏఐఎఫ్ కింద దేశవ్యాప్తంగా 2.28 లక్షలకు పైగా ప్రాజెక్టుల పరిధిలో దాదాపు రూ. 1.75 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఈ పెట్టుబడులు నిల్వ, ప్రాసెసింగ్ సామర్థ్యాలను మెరుగుపరచడానికి.. పంట కోత అనంతర నష్టాలను తగ్గించడానికి, మార్కెట్ అనుసంధానాన్ని పెంచడానికి, రైతులకు తమ ఉత్పత్తులకు మెరుగైన ధరలు లభించేలా చేయడానికి తోడ్పడుతాయని భావిస్తున్నారు.

రైతులకు ఆదాయ అవకాశాలను పెంచడానికి, వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడానికి ప్రభుత్వం అధిక విలువ కలిగిన ఉద్యానవన పంటల వైపు వైవిధ్యీకరణను ప్రోత్సహిస్తోంది. ఉద్యానవన విలువ గొలుసును బలోపేతం చేయడానికి, అధిక విలువ కలిగిన పంటల ఉత్పత్తి- మార్కెటింగ్‌లను ప్రోత్సహించడానికి ఉద్యానవన క్లస్టర్ల అభివృద్ధి ఒక ముఖ్యమైన అడుగు.

ఈ వినూత్న కార్యక్రమాలు రైతులకు ఆర్థిక సహాయం అందించడానికి, వ్యవసాయ మౌలిక సదుపాయాలను ఆధునికీకరించడానికి, పటల వైవిధ్యీకరణను ప్రోత్సహించడానికి.. 'వికసిత్ భారత్' సాధన దిశగా సమృద్ధి, స్థిరత్వం, స్వయంసమృద్ధి కలిగిన వ్యవసాయ రంగాన్ని నిర్మించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మరింత ముందుకు తీసుకెళ్తాయి.

వరి సాగుకు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటలు వేయాలి

రైతులకు సూచించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

హైదరాబాద్, అక్టోబర్ 30:వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వరి పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. సాగు చేస్తున్న పంటలు, నీటి లభ్యత, వ్యవసాయ పరిస్థితులపై ఆరా తీశారు. రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు.

అధిక నీటి వినియోగం అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల కూరగాయల పంటలను ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యత, భూసార పరిస్థితులు, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకుని పంటలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరతను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని రైతులకు సూచించారు.

అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్, అక్టోబర్ 30:హైదరాబాద్ పరిధిలోని కోకాపేటలో విషాదం చోటుచేసుకుంది. 23వ అంతస్తు నుంచి దూకి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న లాస్య లహరి (15) హైదరాబాద్ లోని కోకాపేటలోని ప్రెస్టీజ్ అపార్ట్‌మెంట్‌లో 23వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలేజీకి వెళ్లి చదువుకోవాలని తల్లి మందలించడంతోనే లాస్య లహరి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది.

అక్టోబర్ 29న (గురువారం)న లాస్య లహరిని ఆమె తల్లి మందలించగా.. మనస్తాపానికి గురైన ఆ బాలిక అదే రోజు రాత్రి 7 గంటల సమయంలో అపార్ట్‌మెంట్‌పై నుంచి కిందికి దూకినట్టు సమాచారం. కాగా తన కుమార్తె మృతిపై తండ్రి వెంకటేశ్వర్లు నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు లాస్య లహరి మృతికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

నల్గొండలో ఆరు లైన్ల రోడ్డు.. రూ.20 కోట్లు మంజూరు

3.5 కిలోమీటర్ల మేర సాగర్ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన



నల్గొండ, అక్టోబర్ 30: నల్గొండ నగర అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. సాగర్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం నుంచి చర్లగౌరారం రోడ్డు వరకు 3.5 కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి.

శుక్రవారం మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి స్థానిక కార్పొరేటర్, నాయకులతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సాగర్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటి నివారణకు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో రహదారిని విస్తరించనున్నట్లు తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నగరంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించడంతో పాటు పలు ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, ఘాట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. నల్గొండను స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. మాజీ జెడ్పీటీసీ గుమ్ముల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలో సుమారు రూ.2 వేల కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అఫ్రోజ్ అలీ ఆమేర్, మాజీ మున్సిపల్ వైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పాలకూరి సుమలత సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి : కలెక్టర్ అంకిత్

పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిగా డీఆర్ఓ పద్మావతి నియామకం



ఖమ్మం, అక్టోబర్ 30:భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనుల పురోగతి, వివిధ శాఖల అనుమతులు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అంకిత్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించేందుకు ప్రత్యేక అధికారిగా జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతిని నియమిస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులను వేగవంతం చేయాలని, అవసరమైన ప్రతిపాదనలు, అనుమతులను సంబంధిత శాఖల నుంచి త్వరితగతిన పొందాలని ఆదేశించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చేపట్టిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, నిధులు, అనుమతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలోని పుష్కర ఘాట్ల అభివృద్ధి, విస్తరణతో పాటు భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలపై సమీక్షించారు. పుష్కరాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున స్నానపు ప్రదేశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి సదుపాయాలపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఘాట్ల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన వసతులను గుర్తించి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రామాలయం నుంచి పుష్కర ఘాట్‌కు వెళ్లే మార్గంలో ఉన్న 47 ఇళ్ల తొలగింపునకు సంబంధించిన అంశాన్ని సమీక్షిస్తూ, ఆయా నిర్మాణాల వివరాలు, విలువ అంచనాలు, నిర్వాసితులకు కల్పించాల్సిన పునరావాసం, పరిహారం (ఆర్ అండ్ ఆర్)పై చర్చించారు. బాధితులకు నిబంధనల ప్రకారం పునరావాసం, పరిహారం అందించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

భద్రాచలం బ్రిడ్జి నుండి పుష్కర ఘాట్ లకు రహదారి విస్తరణకు అవసరమైన భూమి, నిర్మాణాలు, భూసేకరణ అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. పుష్కర ఘాట్‌కు అనుసంధానంగా నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తులు, యాత్రికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. భద్రాచలంలో వీఐపీ, వీవీఐపీ అతిథి గృహాల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని సూచించారు. అన్ని వసతులతో ఆరు సూట్లతో కూడిన అతిథి గృహ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులు క్షేత్రస్థాయిలో స్థలాలను పరిశీలించి తగిన ప్రదేశాన్ని ఎంపిక చేయాలని తెలిపారు. అవసరమైన భూసేకరణ ప్రక్రియను ప్రారంభించి, సంబంధిత శాఖల అనుమతులతో ప్రతిపాదనలను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

నంద్యాల పట్టణ అభివృద్ధికి డాక్టర్ బాబన్‌ను గెలిపించండి

కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీ అందించాలి

డాక్టర్ల కుటుంబాల సమావేశంలో మంత్రి ఫరూక్ పిలుపు



అమరావతి, అక్టోబర్ 29: రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1న జరగనున్న పురపాలక ఎన్నికల్లో నంద్యాల చైర్మన్ పదవికి కూటమి తరపున పోటీ చేస్తున్న తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డాక్టర్ బాబన్‌కు మద్దతుగా శుక్రవారం వైద్యుల కుటుంబాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ పురపాలక చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ మహమూద్ ఈ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. నంద్యాల పట్టణ అభివృద్ధి కోసం కూటమి తరపున పోటీ చేస్తున్న టీడీపీ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ బాబన్‌తో పాటు 52 వార్డుల్లోని కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. తాను నంద్యాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశానని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. డాక్టర్ బాబన్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని, మంత్రి ఫరూక్ సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్, మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కూటమి అభ్యర్థులకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, ప్రొద్దుటూరు శాసనసభ పార్టీ పరిశీలకులు ఏవీఆర్ ప్రసాద్, సీనియర్ వైద్యులు డాక్టర్ గెలివి సహదేవుడు, ఆంజనేయస్వామి దేవాలయ చైర్మన్ డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ వనుధ తదితరులు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు. ఈ సమావేశానికి నంద్యాల పట్టణానికి చెందిన వైద్యులు తమ కుటుంబ సభ్యులతో కలిసి అధిక సంఖ్యలో హాజరయ్యారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



ఆదిలాబాద్, అక్టోబర్ 30: చిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ దండేవల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల, ప్రభుత్వ విద్యా ప్రమాణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి , ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల రిజిస్టర్లు, ఔషధాల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే కలెక్టర్ మరమ్మత్తులు వేంటనే చేపట్టాలని కాంట్రాక్టర్, పిఆర్ సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, విద్యా ప్రమాణాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి , ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో బోధన అందించి ఉత్తమ ఫలితాలు సాధించేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగుల రిజిస్టర్లు, ఔషధాల నిల్వలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, వైద్యులు మరియు సిబ్బంది సమయపాలన పాటించాలని కలెక్టర్ ఆదేశించారు.అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ రోహిత్ దేశ్ పాండేకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జాగర్లమూడి ప్రసాద్, పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు సంగర్శ్ రాజేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపాల్ శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూసారాన్ని కాపాడితేనే భవిష్యత్ ..వ్యవసాయానికి భరోసా

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30:సాగు భూముల సారవంతాన్ని కాపాడుతూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించాలనే లక్ష్యంతో ఖేత్ బచావో అభియాన్ ను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్ తెలిపారు. నేరడగం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో భూసార పరిరక్షణ, సేంద్రియ ఎరువుల వినియోగం, పంటల మార్పిడి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.

ఆయన మాట్లాడుతూ వ్యవసాయ భూముల సారవంతాన్ని కాపాడుకోవడం ప్రతి రైతు బాధ్యత అని అన్నారు. అధిక రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశువుల ఎరువు, కంపోస్టు, పచ్చిరొట్ట ఎరువులను వినియోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని సూచించారు. నేలలో సేంద్రియ కర్బనం పెరగడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి, పంటలకు వేలు చేసే సూక్ష్మజీవుల అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు.

పరి కోత అనంతరం మిగిలిన పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని ఉపయోగకర మైన సూక్ష్మజీవులు నశించడంతో పాటు, నేలలోని పోషకాలు తగ్గి పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నడం లేదా కంపోస్టుగా తయారు చేసి వినియోగించడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు.

తెలంగాణ రచయితల సంఘం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో..

పన్నెండేండ్ల సభలు

వర్తమాన సాహిత్యం - తెలంగాణ సంభాషణ

1 నవంబర్ 2026 ఆదివారం

ఉ॥ 10 గంటల నుంచి సా॥ 5 గంటల వరకు

వేదిక: రవీంద్రభారతి సమావేశ మందిరం, హైదరాబాద్

ప్రారంభ సభ

సభాధ్యక్షులు: డా॥ నాళేశ్వరం శంకరం అధ్యక్షులు, తెలంగాణ రచయితల సంఘం

కీలకోపన్యాసం: డా॥ కె. శ్రీనివాస్ సీనియర్ పాత్రికేయులు

అతిథులు: డా॥ నందిని సిధారెడ్డి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత
దేశపతి శ్రీనివాస్ ఎమ్మెల్సీ
డా॥ ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్. డైరెక్టర్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
జి. దేవీ ప్రసాద్ పూర్వ అధ్యక్షులు, టి.ఎన్.జి.ఓ.
విరాహత్ అలీ అధ్యక్షులు, టి.యు.డబ్ల్యు.జె.
బైస దేవదాసు ఎడిటర్, నేటి నిజం

కార్యదర్శి నివేదిక: డా. వి. శంకర్ ప్రధాన కార్యదర్శి, తెరసం

భోజన విరామం
1.00 గం॥ల నుండి 2.00

మధ్యాహ్నం సదస్సు 2 గంటలకు

సభాధ్యక్షులు: డా. బెల్లంకొండ సంపత్ కుమార్ ప్రధాన కార్యదర్శి, తెరసం జంట నగరాలు

వక్తలు: ఎన్. వేణు గోపాల్ ఎడిటర్, వీక్షణం
ఆచార్య బన్న అయిలయ్య ప్రొఫెసర్ (ర), కాకతీయ విశ్వవిద్యాలయం

ఆత్మీయ అతిథి: డా॥ నామోజు బాలాచారి కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి

ఆప్తవాక్యం: కొండపల్లి నీహారిణి రచయిత్రి

కవి సమ్మేళనం సా॥ 4 గంటలకు

సభాధ్యక్షులు: కందుకూరి శ్రీరాములు అధ్యక్షులు, తెరసం జంట నగరాలు

ఆత్మీయ అతిథులు: డా. తూర్పు మల్లారెడ్డి రచయిత, పరిశోధకుడు
డా. వి. జయప్రకాశ్ తెలుగు భాషా చైతన్య సమితి

పాల్గొను కవులు

కందాళై రాఘవాచార్య, పాట్లపల్లి శ్రీనివాస రావు, శ్రీరామోజు హరగోపాల్, డా. చెమన్, దాసరాజు రామారావు, రూప్ కుమార్ దబ్బీకార్, బద్దిరాజు ప్రవీణ్ కుమార్, గద్దం సులోచన, మోతుకూరి అశోక్ కుమార్, పప్పుల రాజిరెడ్డి, సి.హెచ్. ప్రకాశ్, ఘనపురం దేవేందర్, సి.హెచ్. ఉషారాణి, వాసరచెట్ల జయంతి, ధూళిపాల అరుణ, యరకల యాదయ్య, బిల్లా మహేందర్, దేవనపల్లి వీణావాణి, వాణి దేవులపల్లి, దాసరి మోహన్, ఎం. కవిత, ఎం.డి. ఆహ్మద్, ఎం. రాజశేఖర్, వేణుశ్రీ, గుండెల్లి ఇస్తారి, డా. పాశెద్ది రంగయ్య, కె. నవీన్ కుమార్, నరేశ్ చారి, డా. పాశ్వాల బాలయ్య, గంభీరావుపేట యాదగిరి, డా. సిద్దెంకి యాదగిరి, డా. తైదల అంజయ్య, డా. కాసర్ల నరేశ్ రావు, దొమ్మాట శంకర్ ప్రసాద్, కాత్తీకరాజు, పానుగంటి రామమూర్తి, డా. జీడి రమేశ్, రుద్రంగి రమేశ్, సుప్పని సత్యనారాయణ, క్రాంతి కుమార్, నరాల సుధాకర్, నల్లగొండ రమేశ్, ఉప్పల పద్మ, గుత్త ప్రసాద్, గొర్రె అనిల్ కుమార్, పట్లోళ్ల బక్కారెడ్డి.

సాహితీ మిత్రులందరికీ సాదర ఆహ్వానం

ఎం. ఎల్. వసంతకుమారి - కర్ణాటక సంగీత ఆకాశంలో ఒక ధ్రువతార

అక్టోబర్ 31... ఎం. ఎల్. వసంతకుమారి వర్ధంతి



కర్ణాటక సంగీత వినీలాకాశంలో విశిష్టమైన స్థానం సంపాదించిన గాయని ఎం. ఎల్. వసంత కుమారి (మామిడిపల్లి లలిత వసంత కుమారి) సంగీత ప్రియుల హృదయాలలో చెరగని ముద్ర వేసిన వ్యక్తిత్వం. ఆమె గాత్రంలో ఉన్న మాధుర్యం, శైలిలోని ఒరవడి, సంగీతానికి చేసిన సేవలు ఆమెను ఒక ధ్రువతారగా నిలిపాయి.

ఒక గాయని, గురువు, నూతనత్వానికి ప్రతీకగా ఆమె సంగీత ప్రపంచానికి విలక్షణమైన దిశను చూపించారు.

1928, జూలై 3న తమిళనాడు లోని మిట్టపల్లెలో జన్మించిన వసంత కుమారి చిన్ననాటి నుంచే సంగీతం పట్ల ఆకర్షితురాలయ్యారు.

సంగీత విద్వాంసులు తల్లిదండ్రుల ప్రేరణతో తొలి పాఠాలు తల్లి వద్ద నేర్చుకున్నారు. అనంతరం ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసుడు జి.ఎన్. బాల సుబ్రమణియం శిష్యరాలిగా శిక్షణ పొంది, తన గాత్ర ప్రతిభకు పదును పెట్టారు. గురువు చూపిన మార్గం ఆమెలోని సృజనాత్మకతను బలోపేతం చేసింది.

వసంత కుమారి గాత్రంలో నిగ్గు తేలిన నిర్మలత, శ్రుతి శుద్ధత, స్వర నైపుణ్యం ఉండేవి. ఆమె ఆలాపన వినిపించిన ప్రతిసారి శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసేది.

సంక్లిష్ట రాగాలను ఆత్మవిశ్వాసంతో గానం చేసి, వాటిని సులభంగా శ్రోతల చెవుల్లో హాయిగా వెల్లువెత్తేవారు. ఆమె గానంలో 'నాద మాధుర్యం', 'లయ పట్టు', 'భావ భావుకత' లాంటి లక్షణాలు ఎంతో స్పష్టంగా కనిపించేవి.

సంగీత పరిధిని విస్తరించడంలో వసంత కుమారి క్రియాశీలంగా వ్యవహరించారు. "శిఖర ప్రసాదం", "కైలాస ప్రియ" వంటి కొత్త రాగాలను స్వయంగా సృష్టించారు.

'తనివర్ణం' అనే కొత్త సంగీత రూపకాన్ని ప్రవేశ పెట్టారు. సంప్రదాయ సంగీతాన్ని ఆధునిక శైలిలో సమన్వయం చేయడం ద్వారా సంగీతాభిమానులకు కొత్త అనుభూతిని అందించారు.

ఆమె కచేరీలు సంగీత భక్తులకు విందుగా ఉండేవి. త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామ శాస్త్రి వంటి త్రిమూర్తుల కృతులనూ, భద్రాచల రామదాసు, అన్నమాచార్య కీర్తనలనూ ఆమె విభిన్న రీతిలో ఆలపించేవారు. ఆమె గానం కళా రసికుల హృదయాలను తాకేదే కాదు - ఆధ్యాత్మికంగా పులకింపునిస్తూ మానసిక ప్రశాంతతను కలిగించేది.

1940ల నుండి ఆమె ఆకాశ వాణిలో శ్రవ్య సంగీత ప్రదర్శనలు ప్రారంభించి, సంగీతాన్ని సామూహిక శ్రోతలకు పరిచయం చేశారు.

రేడియో ద్వారా ఆమె గాత్రం దేశవ్యాప్తంగా సంగీత అభిమానులను ఆకట్టుకుంది. తమిళ, తెలుగు, కన్నడ భాషల చిత్ర సంగీతంలో కూడా కొన్ని మధుర గీతాల ద్వారా తన ప్రతిభను చాటారు.

గురువుగా ఆమె పాత్ర మరింత గౌరవనీయమైనది.

శిష్యులను కళా సాంప్రదాయాలను కాక, స్వతంత్ర శైలిని అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించడం ఆమె బోధన విధానానికి ప్రత్యేకత. ఆమె శిష్యులలో సుధా రఘు నాథన్, కన్యా కుమారి, మీరా శివరామ కృష్ణన్ వంటి ప్రఖ్యాతులు ఉన్నారు.

శిష్యులకు 'శిల్పిత్వం' నేర్పిన ఆమె, వారిలోని అసలైన కళాకారుని వెలికితీసే దృక్పథంతో ఉండేవారు.

ఆమెకు లభించిన పురస్కారాలు ఆమె శ్రేష్ఠతను ప్రతిబింబించేవి. భారత ప్రభుత్వం 1976లో పద్మభూషణ్ పురస్కారాన్ని, మద్రాసు మ్యూజిక్ అకాడమీ 1977లో సంగీత కళానిధి బిరుదును, కేంద్ర సంగీత నాటక అకాడమీ 1970లో అవార్డును అందించాయి. తమిళనాడు ప్రభుత్వం "కళైమామణి" బిరుదుతో గౌరవించింది.

1990 అక్టోబర్ 31న వసంత కుమారి కన్ను మూశారు. కానీ ఆమె గొంతు, గానం, గాన శైలి సంగీత ప్రపంచంలో చెరగని చిహ్నాంగా మిగిలి పోయాయి. ఆమె సంగీత జీవితం అనేక తరాల యువ కళాకారులకు మార్గదర్శకంగా నిలిచింది.

వసంత కుమారి జీవితమే సంగీతానికి అంకితంగా మిగిలిన మాధుర్య గాథ. ఆమె పాటలు, శిష్యులు, సృష్టించిన శైలులు - ఇవన్నీ కలిసి ఆమెను కర్ణాటక సంగీత గగనతలంలో శాశ్వతంగా ప్రకాశించే ధ్రువతారగా నిలిపాయి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



'వనం-పీవీ ఘనం ' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్



హైదరాబాద్, అక్టోబర్ 30: (నేటినిజం ప్రతినిధి): ఎమ్మెల్సీ సురభి వాణీదేవి రచించిన 'వనం- పీవీ ఘనం అనే పుస్తకాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుక్రవారం ఆవిష్కరించారు. బేగంపేటలోని శ్రీ రామానంద తీర్థ మెమోరియల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మె ల్సీ సురభి వాణీదేవి శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

భారతరత్న, మాజీ ప్రధాని పివి నరసింహ రావు పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ఆయన కుమార్తె ముందుకు సాగడం అభినందనీయం అన్నారు. రామానంద తీర్థ మెమోరియల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యాబోధన, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి. మహేశ్వర్, నిర్వాహకులు ప్రభాకర్, చంద్రశేఖర్, నాయకులు టి. శ్రీహరి, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వం అండగా ఉంటుంది..

ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు: ప్రభుత్వ విప్ విజయరమణారావు

కరీంనగర్, అక్టోబర్ 30:: (నేటినిజం ప్రతినిధి) క్రీడల ద్వారా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందవచ్చని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు.

టీపీ షోలు చూడండి

శుక్రవారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన 70వ ఎసీఎఫ్ ఈస్టువిలే కరీంనగర్ జిల్లా అండర్-17 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్, సెలక్షన్స్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం క్రీడాకారుల ఆటతీరును తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, క్రీడారంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గానికి మంజూరైన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జూన్ నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.3 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆర్చరీలో రెండు బంగారు పతకాలు సాధించిన పెద్దపల్లి నియోజకవర్గం ఎలిగేడు మండలానికి చెందిన చికితను యువ క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆమెకు రూ.4.32 కోట్ల ప్రోత్సాహం లభించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్‌రావు, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముత్యాల రవీందర్, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలి

భూగర్భ జలాల పెంపు, వ్యవసాయ ఉత్పాదకతకు చర్యలు చేపట్టాలి-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

కరీంనగర్, అక్టోబర్ 30: గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టి, భూగర్భ జలాల పెంపుతో పాటు వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం గొల్లపల్లి మండలంలోని అగ్గిమల్ల , గంగాదేవి పల్లి గ్రామాల్లో పర్యటించి, గ్రామాల్లో చేపడుతున్న నీటి సంరక్షణ పనులు, ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పెగడపెల్లి మండలం నంచర్ల గ్రామంలో ఫామ్ పాండ్ నిర్మాణ పనులను తనిఖీ చేసి, పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం దృష్ట్యా ప్రతి గ్రామ పంచాయతీలో జలసిరి కార్యక్రమం కింద నీటి సంరక్షణ పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, స్టోన్ ట్రెంచెస్, కాంటూర్ కందకాలు వంటి పనులను అవసరమైన ప్రాంతాల్లో గుర్తించి చేపట్టాలని తెలిపారు.

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భూమి తేమను కాపాడి వ్యవసాయ ఉత్పాదకత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.వీబీజిరామ్ పథకం కింద రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి, గ్రామాల అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

జారీ చేసినవారు: సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana. 'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.